ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు
5
బుధవారం 12 ఫిబ్రవరి 2025



గృహ ప్రవేశాల పండగ..!

- సామూహిక ప్రారంభానికి అధికారుల చర్యలు
- 11,814 గృహ ప్రవేశాలే లక్ష్యం



- నరసరావుపేటలో పూర్తయిన గృహాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పేదలందరికీ ఇళ్లు కట్టిస్తాం.. ఇళ్లు కాదు ఊళ్లే నిర్మిస్తాం.. అంటూ గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ముందుకు సాగలేదు. కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలోనూ విఫలమయింది. చాలా చోట్ల ఇళ్ల నిర్మాణం పునాదుల స్థాయి దాటలేదు. వేల సంఖ్యలో ఇళ్ల నిర్మాణం నిలిచిపోయింది. ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను కూడా దారి మళ్లించి లబ్ధిదారులకు మొండిచేయి చూపింది. పేదల సొంతింటి కల నెరవేర్చడంతో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇళ్ల నిర్మాణాలను పట్టాలెక్కించింది. పనులను వేగవంతం చేసింది. వేల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసింది. పేదల ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది.

వైసీపీ ప్రభుత్వంలో నత్తనడకన సాగిన ఇళ్ల నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం వేగవంతం చేసింది. గృహాల నిర్మాణం పూర్తికి జిల్లాల వారీగా అధికారులకు నెల వారీగా లక్ష్యాలను నిర్దేశించింది. పల్నాడు జిల్లాలో 4,870 గృహాలు, బాపట్ల జిల్లాలో 2,402, గుంటూరు జిల్లాలో 4,542 ఇళ్లలో గృహప్రవేశాలు లబ్ధిదారుల చేత చేయించాలని ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖకు లక్ష్యాలను నిర్దేశించింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఈ నెలలో జరగాల్సిన గృహ ప్రవేశాలను వాయిదా వేసింది. మార్చిలో సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేర కు జిల్లాల వారీగా ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. లక్ష్యాల మేర ఇళ్ల నిర్మాణాలను గృహనిర్మాణ శాఖ పూర్తి చేసింది. పల్నాడు.. గుంటూరు.. బాపట్ల జిల్లాల్లో 11,814 గృహాలను పూర్తి చేసినట్లు ఆ శాఖ గణాంకాలు తెలియ జేస్తున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ 8 వరకు ఉండ టంతో ఆ తదుపరి గృహప్రవేశాలకు మంచి ముహూ ర్తాన్ని ఖరారు చేయనున్నారు.

మార్చి నెలాఖరుకు 12,392 గృహాల నిర్మాణం

ఒక వైపు సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించడంతో పాటు మూడు జిల్లాల్లో మార్చి నెలాఖరు కల్లా 12,392 గృహాల నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులకు టార్గెట్‌లు ఇచ్చింది. ఈ మేరకు ఇళ్ల నిర్మాణం పూర్తికి అధికారులు చర్యలు చేపట్టారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేశారు. మార్చి నెలాఖరుకు పల్నాడు జిల్లాలో 3,143 ఇళ్ల పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. బాపట్ల జిల్లాలో 4,898, గుంటూరు జిల్లాలో 4,359 ఇళ్ల పూర్తి చేసేందకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. లబ్ధిదారులతో చర్చలు జరిపి ఇంటి నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేస్తున్నారు. గృహ నిర్మాణ శాఖ ఉన్న తాధికారులు క్షేత్ర స్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

మిర్చికి.. కూలి ఘాటు

- క్వింటాల్ రూ.10 వేలు.. కూలి రూ.6 వేలు
- పంట అమ్మగా వచ్చినదాంట్లో సగం కూలి ఖర్చు
- కర్నూలు కూలీలు రాకపోవడంతో పెరిగిన రేట్లు
- ఎకరాకు సాగు ఖర్చు రూ.1.50 లక్షల నుంచి రూ.2.20 లక్షలు

మిర్చి సాగు.. మంట పుట్టిస్తోంది. ఒకవైపు ధర లేక రైతులు అల్లాడుతుంటే.. మరోవైపు అమాంతం పెరిగిన కూలి రేట్లు కోలుకోలేని విధంగా నష్ట పరుస్తున్నాయి. తెగుళ్లతో దిగుబడులు తగ్గిపోగా వాటిని అమ్ముకు నేందుకు సతమతం అవుతున్నారు. అరకొరగా వచ్చిన పంటను కోసేందుకు సిద్ధమవగా కూలీలు దొరక్క.. ఉన్న కూలీలు అమాం తం కూలి రేట్లు పెంచేయడంతో ఏమి చేయాలో పాలు పోని పరిస్థితుల్లో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్చి క్వింటాల్ రూ.6 వేలు ఉండగా.. ఎకరా కోత కూలి ఖర్చు రూ.10 వేలు వరకు వెచ్చిం చాల్సి వస్తోం ది. ఒకవైపు సాగు ఖర్చు లు పెరిగిపోగా కోతలో సగ భాగం కూలి ఖర్చులకే పోతోందని కన్నీటి పర్యంతమవు తున్నారు. ఈ ఏడు హఠాత్తుగా పెరిగిన కూలి రేట్లు మిర్చి రైతులను పాతాళంలో పడేస్తున్నాయి.

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మిర్చి రైతులపై ఏదో ఒకవిధంగా దెబ్బ పడుతూనే ఉంది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల రైతులపై పెరిగిన కూలి రేట్ల కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. ప్రస్తుతం గుంటూరు మిర్చి యార్డులో డీలక్స్ రకాలు క్వింటాల్‌కు రూ.9 వేల నుంచి రూ.10 వేలు మాత్రమే పలుకుతున్నాయి. తేజ రకం మాత్రం రూ.11 వేల నుంచి రూ.13 వరకు పలుకుతోంది. అయితే ఒక కేజీ మిరప కాయలు కోసినందుకు రూ.16 వరకు కూలి తీసుకుంటున్నారు. మూడు కేజీలు పండు మిరపకాయలు కోస్తే అవి ఎండేటప్పటికి ఒక కేజీ అవుతున్నాయి. ఈ లెక్కన ఒక కేజీ ఎండు మిరప కాయల కోత కూలీ రూ.48 వరకు అవుతుంది. కొన్ని చోట్ల రోజు కూలి చొప్పున కోతలు కోస్తున్నారు. రోజుకు కూలి రూ.470 వరకు చెల్లిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కోత కోస్తే ఈ కూలి ఇస్తారు. తాలుకాయలు (తెల్లకాయలు) ఏరినందుకు రోజుకు రూ.600 వరకు చెల్లిస్తున్నారు. రైతులు చెబుతున్న లెక్క ప్రకారం ఒక క్వింటాల్ మిర్చి కోతకు 12 మంది కూలీలు అవసరం. ఈ లెక్కన క్వింటాల్‌కు కూలి రూ.6 వేలకు తక్కువ కావడం లేదని తెలుస్తోంది.

వలస కూలీలు రాకే..

వాస్తవానికి కర్నూలు నుంచి మిర్చి కోతల కోసం ప్రతి ఏటా పెద్దసంఖ్యలో కూలీలు వలస వచ్చే వారు. అయితే ఈ ఏడాది వలస వచ్చేందుకు అక్కడి కూలీలు ఇష్ట పడటంలేదు. అక్కడే మిర్చి కోతలు ఎక్కువగా ఉండటం, కూలి కూడా రోజుకు రూ.250 వరకు పడుతుండటంతో చాలామంది ఇటువైపునకు రాలేదు. దానివల్ల మిర్చి సీజన్‌లో కూలీల కొరత ఏర్పడింది. స్థానికంగా ఉన్న కూలీలకు బాగా డిమాండ్ వచ్చింది. స్థానికులు రూ.470కి తక్కువ ఇస్తే కోతకు రామని ముందే చెబుతున్నారు ప్రస్తుతం ఉన్న మిర్చి ధరల ప్రకారం పండిన పంటలో సగ భాగం కూలి ఖర్చులకు పోతుండగా, సగం మాత్రమే రైతులకు పెట్టుబడి, లాభాల కింద మిగులుతుంది.

ఎకరాకు రూ.లక్ష నష్టం..

ఈ ఏడాది ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలోని రైతులు పెట్టుబడి కింద పెద్దమొత్తంలో వ్యయం చేశారు. ప్రకాశం జిల్లాలో పెట్టుబడి కింద ఎకరాకు రూ.1.50 లక్షలు వరకు వెచ్చించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎకరాకు పెట్టుబడి రూ.1.80 లక్షల నుంచి రూ.2.20 లక్షల వరకు ఖర్చు అయినట్లు రైతులు తెలిపారు. కౌలు రేట్లు ఎక్కువ కావడం, నల్లి తెగులు బెడదతో పెట్టుబడులు పెరిగిపో యాయి. ఈ లెక్కన మిర్చి పంట అమ్మగా వచ్చినదాంట్లో సగం కూలి ఖర్చు అవుతుంటే రైతుకు ఎకరాకు రూ.లక్ష నుంచి రూ. లక్షన్నర వరకు తక్కువలో తక్కువ నష్టం వస్తుందని తెలుస్తోంది.

నిండా మునిగినట్లే..



మిర్చి ఎందుకు వేశామో అర్థం కావడం లేదు. రైతుకు మిగిలేది ఏమి లేదు. ఇక్కడ రేటు చూస్తే చాలా తక్కువ ఉంది. అక్కడ కూలీల రేటు ఆకా శాన్ని అంటింది. వచ్చిన దాంట్లో సగం కూలీలకు పోతుంటే ఇక మాకు మిగిలేదేమిటి. ఈ ఏడాది నిండా మునిగినట్లే.

- దళారి వెంకట నర్సయ్య, వాదం పల్లె, యర్రగొండ పాలెం

ఉన్నది అమ్మి అప్పు కట్టాలి

ఈ ఏడు మా పని అయిపోంది. ఏదో రేటు వస్తుందని మిర్చి వేస్తే వేసిన రోజు నుంచి నిద్ర పోయింది లేదు. ఎప్పుడూ ఏదో ఒక సమస్య. పంటను గుంటూరు యార్డుకు తీసుకురావడానికి మేము పడిన కష్టం పగవాడికి కూడా రాకూడదు. కూలి రేటు చూస్తే గుం డెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. సగం కూలికే పోతే ఇక మందులు కొట్టోడుకి ఏమి ఇవ్వాలి. ఉన్నది అమ్మి కట్టాల్సిందే.

- బాదరయ్య, గంగాపాలెం, యర్రగొండపాలెం

కూలీలు తక్కువగా వచ్చారు



ప్రతి ఏటా కర్నూలు నుంచి కూలీలు ఎక్కువ సంఖ్యలో వస్తే ఇంత ఇబ్బంది ఉండే ది కాదు.కూలి రేటు బాగా పెరిగింది. రోజుకు రూ.400 కూలి, ఆటో ఖర్చు రూ.50 వరకు ఖర్చైంది. క్వింటాల్ మిర్చి అమ్మితే వచ్చిన దాంట్లో సగం కూలికే ఖర్చయితే రైతుకు మిగిలేది ఏమిటి.

హనుమంతరావు, తాళ్లచెరువు, పల్నాడు జిల్లా



విచ్చలవిడి వినియోగం

- ఎరువుల వాడకంపై ఆలకించని రైతులు
- రబీ మొత్తానికి వాడాల్సినవి జనవరికే పూర్తి
- ఎకరాకు 8 కట్టలకుపైగా యూరియా.. మోతాదుకు మించి డీఏపీ
- పంజాబ్ తర్వాత ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ఎక్కువ వాడకం



గుంటూరు సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువులు.. మేలు చేయవు. కాలుష్యాలను వెదజల్లుతున్నాయి.. పంటకు నష్టం.. భూమి నిస్సారం.. అని వ్యవసాయశాస్త్రవేత్తలు, ప్రభుత్వం హెచ్చరిస్తోంది. అయినా రైతులు ఆ మాటలను ఆలకించడంలేదు. దిగుబడి పెరుగుతుందనే అపోహతో విచ్చలవిడిగా ఎరువులను వినియోగిస్తున్నారు. గుంటూరు జిల్లాలో రబీ సీజన్ మొత్తానికి 70,826 మెట్రిక్ టన్నుల యూరియా, 19,225 మెట్రిక్ టన్నుల డీఏపీ, 3322 మెట్రిక్ టన్నుల పొటాష్ వాడాలి. కానీ రైతులు నిర్దేశించిన ఎరువుల నిల్వలన్నీ జనవరిలోనే ఖాళీ చేసేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పంజాబ్ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే యూరియా, ఇతర ఎరువుల వాడకం ఎక్కువగా ఉందని కేంద్రం హెచ్చరించింది. అయినా పరిస్థితిలో ఏమాత్రం మార్పు రావడంలేదు. ఈ విధానంపై సర్వత్రా ఆందోళన నెలకొంది. చాలా చోట్ల ఎకరాకు 8 కట్టలకు పైగా యూరియా వాడినట్లు తేలింది. డీఏపీ, పొటాష్ వాడకం కూడా అంతే ఉంది. ఎక్కువ తింటే ఏమౌతుంది? భుక్తాయాసం వస్తుంది.. భూమి పరిస్థితి కూడా అంతేనని హెచ్చరిస్తున్నా రైతులు మేలుకోవడంలేదు. ఎరువులు ఎక్కువ వాడకం వల్ల భూమి సహజతత్వం కోల్పోతోందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా అన్నదాతలు ఆలకించడంలేదు. ఎరువుల వాడకంపై వ్యవసాయ శాఖ ప్రతి సీజన్‌లో ప్రత్యేకంగా కరపత్రాలు ముద్రించి రైతులకు తగిన సూచనలు చేస్తున్నా ఫలితం ఉండటం లేదు.

అపోహలతో.. నష్టం

ఎరువులు ఎక్కువ వాడితే భూమికి బలం పెరిగి దిగుబడి పెరుగుతుందని రైతుల భావన. నత్రజని పోషకంతో ఉండే యూరియా రసాయన ఎరువు వేస్తే పైరు ఏపుగా పెరిగి అధిక దిగుబడి వస్తుందనే అపోహ రైతుల్లో ఉంది. దానివల్ల సీజన్‌తో సంబంధం లేకుండా ఎరువులను ఎక్కువగా చల్లేస్తున్నారు. ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల భూమి నిస్సారం అవుతుందని, దీర్ఘకాలం తర్వాత ఈ నష్టం కని పిస్తుందని శాస్త్ర వేత్తలు చెబుతున్నారు. ఉదాహరణకు.. భాస్వరం పోష కాన్ని పంటలకు ఇచ్చేందుకు డై అమ్మోనియం పాస్ఫేట్(డీఏపీ) పేరుతో మార్కెట్లో రసాయన ఎరువులను విక్రయిస్తున్నారు. ఎరువులను నిరంతరం ఉపయోగించడం వల్ల నేల పీహెచ్ విలువ మారు తుందని, పైరు తెగుళ్ల బారిన పడే అవకాశం పెరుగు తుందని వ్యవసాయశాఖ చెబుతోంది. రసాయన ఎరువుల అధిక వినియోగం నేల ఆమ్లీకరణను వేగవంతం చేస్తుందని, నేలపై పొరలోనూ మార్పులు వస్తాయని చెబుతున్నారు. రైతులు తమ పొలాలకు వినియోగించే రెండు ప్రధాన ఎరువులు నత్రజని, భాస్వరం. పరిశోధన ప్రకారం పంటలపై ఉపయోగించే నత్రజనిలో దాదాపు మూడింట రెండు వంతులు కాలుష్య కారకంగా మారుతున్నట్లు తెలుస్తోంది. దానివల్ల వాతావరణ కాలుష్యం పెరిగిపోతోందని చెబుతున్నారు.

అవసరానికి మించి భాస్వరం

భాస్వరం రసాయన ఎరువు వినియోగం ఏకంగా 36 శాతం పెరిగినట్లు అధ్యయనంలో గుర్తించారు. కొన్ని ప్రాంతాల్లో భూసార పరీక్షలు చేస్తే నేలలో అవసరానికి మించి భాస్వరం ఉన్నట్లు తేలింది. ఇది ఎక్కువగా ఉంటే డీఏపీ ఎరువును పెద్దగా వాడాల్సిన అవసరం ఉండదు. అయినా ఉమ్మడి గుంటూరు జిల్లాలో డీఏపీ ఎక్కువగా చల్లుతున్నారు.

సిఫార్సులను బట్టే చల్లాలి..

ఎరువుల వాడకంలో రైతుల్లో కొన్ని అపోహలు ఉన్నట్లు వ్యవసాయశాఖ గుర్తిం చింది. రైతులందరూ మొదటి సారి డీఏపీ వేయాలనే అపోహతో ఉంటున్నట్లు తెలుస్తోంది. పోషకాలను ఇతర కాంప్లెక్స్ ఎరువుల రూపంలో కూడా మోతాదును లెక్క కట్టి వేసినా పంట ఎదు గుదల, దిగుబడిలో

(మిగతా 8వ పేజీలో)

మండలి బరిలో.. 30 మంది

- ఎమ్మెల్సీ నామినేషన్ల పరిశీలన పూర్తి
- 10 మంది అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణ



కలెక్టరేట్‌లో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్లను పరిశీలిస్తున్న ఆర్‌వో నాగలక్ష్మి, అబ్జర్వర్ కరుణ

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల నామినేషన్ల పరిశీలన పూర్తి అయింది. మొత్తం 40 మంది అభ్యర్థులకు చెందిన 69 నామినేషన్లను పరిశీలించారు. 10 మంది అభ్యర్థుల నామినేషన్లను వేర్వేరు కారణాలతో తిరస్కరించారు. అన్ని సవ్యంగా ఉన్న 30 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమో దిస్తున్నట్లు ఆర్‌వో నాగలక్ష్మి ప్రకటించారు. మంగళవారం గుంటూరు కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ జరిగింది. ఈ కార్యక్రమానికి అబ్జర్వర్ వీ కరుణ హాజరయ్యారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరపున హాజరైన ఎన్నికల ఏజెంట్ సతీష్ గవిని ఒక అభ్యంతరాన్ని లేవనెత్తారు. నాన్ జ్యూడీషియల్ స్టాంపు పేపర్‌పై అఫిడవిట్లు సమర్పించని అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించాలని కోరారు. ఆ అభ్యంతరాన్ని ఆర్‌వో తిరస్కరించారు. ఇదే రీతిన అంబాల రాజకుమార్ అనే అభ్యర్థి ఓటర్ల జాబితాలో 9 మంది ప్రతిపాదన చేసి వారి పేర్లు సరిపోయినా నామినేషన్ ఆమోదించాలన్నారు. దీనిని కూడా తిరస్కరిస్తున్నట్లు ఆర్‌వో ప్రకటించారు. ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ నాలుగు నామినేషన్లు దాఖలు చేయగా అన్నింటిని ఆమోదించారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మూడు నామినేషన్లు వేయగా ఆమోదించారు. టీడీపీ జారీ చేసి బీ ఫారంలో ప్రధాన అభ్యర్థిగా రాజేంద్రప్రసాద్ పేరు ఉండటంతో ఆయన సతీమణి మాధవి దాఖలు చేసిన రెండు నామినేషన్లను తిరస్కరించారు. వీరితో పాటు (మిగతా 8వ పేజీలో)

నిధుల గోల్‌మాల్‌పై నివేదికలు సిద్ధం

- ఇష్టారీతిన పంచాయతీల్లో సొమ్ములు స్వాహా
- 18 పంచాయతీలపై విచారణకు ప్రభుత్వం ఆదేశాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

నిబంధనలు పట్టలేదు.. అధికారం తోడుగా ఉంది.. చెప్పినట్లే తలాడించే సిబ్బంది ఉన్నారు.. ఇంకేముంది గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు గ్రామ పంచాయతీల నిధులను బొక్కేశారు. పంచాయతీల్లో అవకతవకలు జరుగుతున్నాయని వైసీపీ ప్రభుత్వం చివరి మూడేళ్లలో దాదాపు 800 వరకు ఫిర్యాదులు ఉన్నతాధికారులకు అందినా బుట్టదాఖలయ్యాయి. పంచాయతీల్లో జరిగిన నిధుల గోల్‌మాల్‌పై కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తొలినాళ్లలోనే దృష్టి సారించింది. గతంలో విచారణకు ఆదేశించిన పంచాయతీలతో పాటు ఆరోపణలు వచ్చిన మరి కొన్నింటిపై కూడా ఇటీవలే కలెక్టర్ వెంకటమురళి విచారణాధికారులను నియమించారు. దీంతో అక్రమార్కుల గుండెల్లో వణుకు మొదలైంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 18 పంచాయతీల్లో నిధుల గోల్‌మాల్ భారీగా జరిగినట్లు కూటమి ప్రభుత్వం ఓ నిర్ధారణకు వచ్చింది. వీటిల్లో పదింటికి సంబంధించి విచారణ నివేదికలు ఇప్పటికే సిద్ధమయ్యాయి

నాలుగు గ్రామాల నిధులు ఒక పంచాయతీకే...

వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు చెప్పిందే రూల్ పొజిషన్‌గా మారిందనడానికి బల్లికురవ మండల పరిధిలోని కొణిదెనలో జరిగిన నిబంధనల ఉల్లంఘన పరాకాష్టగా నిలిచింది. నాలుగు పంచాయతీలకు పంచాల్సిన నిధులను ఒకే పంచాయతీకి మళ్లించేశారు. దీనికి సంబంధించి గతేడాది జూలై చివరిలోనే ప్రభుత్వానికి నివేదికలను అప్పటి డీపీవో రవికుమార్ అందించారు. కారంచేడు మండలం కుంకలమర్రు పరిధి గ్రామ పంచాయతీలో జరిగిన అవకతవకలపై అధికారులు నివేదిక సిద్ధం చేశారు. పడమర బాపట్ల గ్రామ పంచాయతీలోని దాదాపు రూ.80 లక్షల గోల్‌మాల్ స్థానిక వైసీపీ నేతల కనుసన్నల్లోనే జరిగినట్లు అధికారులు నివేదికలో పొందు పర్చినట్లు తెలుస్తోంది. ఇంకొల్లు మేజర్ పంచాయతీలో దాదాపు రూ.2 కోట్లను దుర్వి నియోగం చేశారన్న ఆరోపణలపై ఎట్టకేలకు నివేదిక సిద్ధమైంది. పంచాయతీల్లో నిధులు అవకతవకలకు సంబంధించి జంపనిలో రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. రేపల్లె డివిజన్ పరిధిలోని పల్లెకోన, మోదుకూరు పంచాయతీల్లో జరిపిన విచారణ నివేదికలను అధికారులు ప్రభుత్వం ముందుంచారు. ఇవే కాకుండా జిల్లా వ్యాప్తంగా మరో పన్నెండు పంచాయతీల్లో వి చారణ జరిపి ఆ వివరాలను సమగ్రంగా ప్రభుత్వానికి నివేదికల రూపంలో అధికారులు అందించారు



ఇంకొల్లు గ్రామ పంచాయతీ కార్యాలయం

చర్యలే తరువాయి..

గత ప్రభుత్వంలో పంచాయతీల్లో జరిగిన గోల్‌మాల్ వ్యవహారాలపై నివేదికలు ఇప్పటికే ఉన్నతాధికారులకు అందడంతో రేపోమాపో చర్యలు తీసుకునే అవకాశాలు కనబడుతున్నాయి. నిధుల రికవరీపై కూడా దృష్టి సారించబోతున్నట్లు తెలుస్తోంది. దాదాపు 15 మంది పంచాయతీ సిబ్బందికి నోటీసులు జారీ చేయడానికి సిద్ధమైనట్లు సమాచారం.

జేఈఈ టాపర్ సాయిమనోజ్ఞ



- సాయి మనోజ్ఞకు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు పద్మజ, కిశోర్ చౌదరి,భాష్యం ఐఐటీ కోఆర్డినేటర్ ఆనంద్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) మంగళవారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ ఫలితాల్లో జేకేసీ రోడ్డు ప్రాంతానికి చెందిన విద్యార్థిని గుత్తికొండ సాయి మనోజ్ఞ అగ్రస్థానంలో నిలిచింది. తల్లి పద్మజ గృహిణికాగా, తండ్రి కిశోర్‌చౌదరి ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్. కాగా పదో తరగతి వరకు గుంటూరులోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో సాయిమనోజ్ఞ చదివింది. ఇక ఇంటర్ విద్య భాష్యంలో సాగింది. కాగా ఇటీవల జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ పరీక్షలు రాసిన మనోజ్ఞ జాతీయ స్థాయిలో నూరుశాతం పర్సంటైల్‌తో ఓపెన్ కేటగిరిలో టాపర్‌గా నిలిచింది. టాపర్‌గా తమ కుమార్తె నిలవడంతో తల్లిదండ్రులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. కాగా భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేతరామ్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఆనంద్ సాయిమనోజ్ఞను అభినందించారు.

ఐఐటీలో ఈసీఈ సీటు సాధిస్తా

ప్రణాళికబద్ధంగా చేసిన కృషి, సమయ పాలన, తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకుల ప్రోత్సాహంతో జేఈఈలో అత్యుత్తమ ర్యాంకు సాధించినట్లు సాయిమనోజ్ఞ తెలిపారు. రోజుకు కనీసం 12 గంటలు చదివినట్లు చెప్పారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదవడం వల్లే అత్యుత్తమ ర్యాంకు సాధ్యమైందన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే భాష్యం సంస్థలు అమలు చేసే కరిక్యులం టాపర్‌గా నిలవడానికి దోహదపడిందన్నారు. ఒత్తిడిని అధిగమించడానికి స్ఫూర్తిప్రదాతలతో ఛైర్మన్ రామకృష్ణ, కోఆర్డినేటర్ ఆనంద్ కౌన్సిలింగ్ ఇప్పించారని తెలిపారు. అడ్వాన్స్ పరీక్షకు సన్నద్ధమౌతున్నానని, పతిష్ఠాత్మక ఐఐటీలో ఈసీఈ బ్రాంచిలో సీటు సాధించడమే లక్ష్యమని విద్యార్థిని తెలిపారు.

చోరీ కేసుల్లో ఇద్దరు అరెస్టు

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలో దొంగతనాలకు పాల్పడుతున్న రెండు కేసులకు సంబంధించి ఇద్దరిని తాడేపల్లి, గుంటూరు సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్ జోన్ డిఎస్పీ మురళీకృష్ణ నిందితుల వివరాలు వెల్లడిం చారు. తాడేపల్లి కేఎల్ రావు కాలనీకి చెందిన చల్లా నాగరాజు, బోరా దుర్గారెడ్డిలను అదుపులోకి తీసుకుని వారి నుండి 174 గ్రాముల బంగారం, రూ.60వేల నగదు, యాపిల్ ఫోన్ కలిపి మొత్తం సుమారు రూ.16 లక్షల విలువైన నగదు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. జల్సాలకు, చెడు వ్యసనాలకు బానిసలై ఇంటిలో ఎవరూ లేని సమయంలో తాళాలు పగుల గొట్టి వీరు దొంగతనాలకు పాల్పడుతు న్నారని చెప్పారు. నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన తాడేపల్లి పోలీసులను ఎస్పీ సతీష్‌కుమార్, డిఎస్పీ మురళీకృష్ణ అభినందించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ

యార్డులో మిర్చి రైతుల ఆందోళన

- ఒకవైపు మిర్చి ధర పతనం... మరో వైపు వ్యాపారుల మోసం
- కడుపు మండి రోడెక్కిన రైతన్నలు
- తగిన చర్యలు చేపట్టలేకపోతున్న మార్కెటింగ్ శాఖ అధికారులు



మిర్చి యార్డులో ఆందోళన చేస్తున్న రాయలసీమ జిల్లాల రైతులు

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో రైతులు కుదేలౌతున్నారు. ఈ సీజన్ ప్రారంభం నుంచి మిర్చి ధర పతనం అయి నష్టాలు చవి చూస్తున్న రైతులకు కొంతమంది వ్యాపారస్థులు చేస్తున్న మోసాలతో ఆర్థికంగా చితికిపోతు న్నారు. తమకు జరుగుతున్న నష్టంపై మార్కెటింగ్ శాఖకు నివేదిస్తున్నా ఏ ఫలితం లేకపోవడంతో కడుపు మండిన రైతులు మిర్చియార్డులోనే రోడ్డెక్కి ఆందోళనకు దిగుతున్నారు.

మంగళవారం రాయలసీమలోని కర్నూలు జిల్లా నుంచి వచ్చిన రైతుల వద్ద నుంచి మిరపకాయలను చాలా తక్కువ ధరకు వ్యాపారస్థులు నిర్ణయించ డంతో వారు ఆందోళనకు దిగారు. మరోవైపు పల్నాడు జిల్లా అచ్చంపేట మండలంలోని గ్రంథసిరి నుంచి వచ్చిన రైతులు తమను ఇద్దరు కమీషన్ వ్యాపారులు నిలువునా మోసం చేసి రూ.50 లక్షలు ఎగ్గొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరుస ఆందోళనలతో దీంతో మార్కెటింగ్ శాఖలో అధికారులు ఒక్కసారిగా కలవరపాటుకు గురయ్యారు.

మంగళవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, మంత్రాలయం తదితర ప్రాంతాల నుంచి రైతులు వివిధ రకాల మిర్చిని తీసుకొచ్చారు. మిర్చిని తీసుకొచ్చే ముందు సోమవారం ఇక్కడి కమీషన్ వ్యాపారస్థులకు ఫోన్లు చేస్తే మార్కెట్ రైజింగ్‌లో ఉన్నది. క్వింటాల్‌కు రూ. 14 వేల నుంచి రూ. 15 వేల ధర పడుతుం దని చెప్పారు. దాంతో రైతులు మిర్చిని యార్డుకి తీసుకురాగా వ్యాపారస్థులు వాటిని చూసి రంగు బాగా లేదు, తాలు అధికంగా ఉన్నది, కాయ సైజు లేదు వంటి కారణాలు చెప్పి క్వింటాల్‌కు రూ. 12 వేలు మించి ధర రాదన్నారు. ఎన్నో వ్యయప్రయాసలు పడి తీసుకొచ్చిన మిర్చిని కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ చేసుకోలేక, తిరిగి వెనక్కు తీసుకెళ్లలేక వ్యాపారస్థులు నిర్ణయించిన ధరకు అమ్ముకోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 2023 సీజన్‌లో మిర్చికి క్వింటాల్ ధర రూ. 22 వేలకుపైగా ధర లభించింది. గత ఏడాది రూ. 18 వేల వరకు ధర చెల్లించారు. ఇప్పుడు కేవలం రూ. 12 వేలు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన భరితమయ్యారు.

పల్నాడు జిల్లా అచ్చంపేట మండలంలోని గ్రంథసిరి గ్రామానికి చెందిన రైతులు కోటపాటి నాగేశ్వరరావు, రామకోటేశ్వరరావు, నరసింహారావు, పర్చూరి ప్రతాప్, కిలారి నాగేశ్వరరావు వచ్చి మిర్చియార్డు పరిపాలన భవనం ఎదుట ఆందోళనకు దిగారు. తమను మిర్చియార్డులో విజయ భాస్కర ట్రేడర్స్‌కు చెందిన గోపు శ్రీనివాసరెడ్డి, సంగెళ్ల కిషోర్‌రెడ్డి నిలువునా మోసం చేశారని వాపోయారు. మిర్చి అమ్మిన తాలుక పైకం తమకు ఒక్కొక్కరికి రూ. 10 లక్షలు రావాలన్నారు. ఎన్నిసార్లు వెళ్లినా ఇవ్వకుండా రౌడీలతో దౌర్జన్యం చేయిస్తున్నారని చెప్పారు. దీనిపై తాము లాలాపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే విజయ భాస్కరట్రేడర్స్ లావాదేవీలు నిలిపేశామని అధికారులు చెబుతున్నారే తప్పా అతను వేరే ఫరం పేరుతో మిర్చి కొనుగోళ్లు చేస్తూనే ఉన్నారన్నారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రికకు ఫిర్యాదు చేయగా ఆమె తాను అన్ని పరిశీలించి చర్యలు చేపడతామ న్నారు. కాగా రైతులను మోసం చేసిన శ్రీనివాసరెడ్డి, కిషోర్‌రెడ్డిపై కేసులు నమోదు చేశామన్నారు. అలానే వాళ్లిద్దరూ వేరే ఫరంల ద్వారా చేసిన లావాదేవీలపై పూర్తి వివరణ కోరుతూ నోటీసులు జారీ చేశామన్నారు.



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో శ్రీచైతన్య ఎగ్జిక్యూటివ్ ఏజీయం ఈమని దుర్గాప్రసాద్, డీన్ సురేష్, అధ్యాపకులు

జేఈఈ మెయిన్స్‌లో శ్రీచైతన్య ప్రభంజనం

- అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులు
- అభినందించిన కళాశాల డీన్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్టీఏ) మంగళవారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గుంటూరు శ్రీచైతన్య విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ సాధించారని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ విద్యార్థులు నంబూరు హేమంత్ అభిరామ్ 99.98 శాతం పర్సంటైల్, మహ్మద్‌తబిష్ అయ్యాన్ 99.83, బెల్లం రుద్రతేజ 99.81, కుర్ర ప్రరణ 99.62, కెఎల్ స్వరూప 99.48, నల్లపాటి కృష్ణచైతన్య 99.25 పర్సంటైల్‌తో అగ్రస్థానంలో నిలిచారని వెల్లడించారు. అదే విధంగా 99శాతం పర్సంటైల్ పైన 32 మంది, 98 శాతం పర్సంటైల్ పైన 55 మంది, 97 శాతంపైన 91 మంది, 95 శాతంపైన 105, 90 పైగా పర్సంటైల్ 249 మంది సాధించారని వివరించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను డీన్ సురేష్, ప్రిన్సిపాల్ బాలసుబ్రమణ్యం, అధ్యాపకులు అభినందించారు.

విజ్ఞాన్స్ - ష్నైడర్‌ల మధ్య ఎంవోయూ



అవగాహన పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణం, డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ బెంగళూరు లోని ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని మంగళవారం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. మంగళ వారం విజ్ఞాన్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ సుమతిసహగల్, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగ భూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్‌లు అవగాహన ఒప్పం దపత్రాలు మార్చుకున్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో మేఘన తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125.134.145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

1,45,429 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,43,421 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,45,429 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 75,679 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	9000	13600	334	9500	11500
నంబరు. 5	9500	13500	నంబరు. 5	--	--
273	10000	13000	273	--	--
341	10000	14000	341	--	--
4884	9000	11500	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	13800	తేజ	--	--
బ్యాడిగి	10000	13200	బ్యాడిగి	9500	9500
దేవనూరు డీలక్స్	10000	13500	దేవనూరు డీలక్స్	--	--
తాలుకాయలు	4500	7500	తాలుకాయలు	--	--



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న మలేరియా అధికారి గోపినాథ్

దుండిపాలెంలో చికున్ గున్యా

- అప్రమత్తమైన వైద్య సిబ్బంది

చుండూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : చికున్ గున్యాతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. యడ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దుండిపాలెం గ్రామంలో చికున్‌గున్యా సోకిన వ్యాధిగ్రస్తుడిని బాపట్ల జిల్లా మలేరియా అధికారి గోపినాథ్, వైద్యులు శ్రీనిధి, సబ్ యూనిట్ ఆఫీసర్ ఎండీ షాకిల్ పరామర్శించారు. అనంతరం గ్రామంలో చికున్‌గున్యా ఇతరులకు వ్యాప్తి చెందకుండా పారిశుధ్య సిబ్బందితో బ్లీచింగ్, శానిటైజేషన్ చేశారు. దోమల నిర్మూలన గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్‌వో మహబూబ్ వలి, కెవి భాస్కర్, ఎం.అప్పారావు, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

బాపట్ల ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బాపట్ల పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బాపట్ల పట్టణం అక్బర్‌పేటకు చెందిన జి.వేణు (19) గత సంవత్సరంలో ఇంటర్‌పరీక్షలలో ఫెయిల్ అయ్యాడు. మరళా మరలా ఈ మధ్య సప్లమెంటరీ పరీక్షలు రాశాడు. అందులోనూ ఫెయిల్ అవ్వటంతో మనస్తాపానికి గురై ఇంట్లో కుటుంబ సభ్యులు లేని సమయంలో ఉరివేసుకొని మృతి చెందాడు. విషయం తెలుసుకొని సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించామని పట్టణ పోలీసులు తెలిపారు.

భయంతోనే జగన్ అసెంబ్లీకి రావడం లేదు

- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ,ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): చేసిన తప్పులకు ఎక్కడ సమాధానం చెప్పాల్సి వస్తుందో అన్న భయంతోనే మాజీ సీఎం జగన్ అసెంబ్లీకి రానంటున్నాడని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో విప్‌లు అందరితో అసెంబ్లీ సమావేశాల సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో జీవీ మాట్లాడుతూ ప్రభుత్వ పనితీరు, ప్రజా సమస్యల గురించి మాట్లాడేందుకు అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉండాలన్న కనీస విషయాన్ని కూడా మరిచిపోయి మాజీ సీఎం జగన్ వ్యవహ రిస్తున్నారని, ప్రజాస్వామ్యం అంటే అతడికి ఉన్న చిన్న చూపు ఉందన్నారు. ఈనెల 22, 23 తేదీలలో ఎమ్మెల్యేల కోసం అవగాహన సదస్సు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. అవగాహన సదస్సులకు ముందు రోజు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, తర్వాతరోజు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరవుతున్నారన్నారు. సభా గౌరవ మర్యాదలు పెంచేలా ఈసారి సమావేశాలు ఉంటాయన్నారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

తెలుగు సంగీత ధ్రువతార ఘంటసాల

● సాహితి భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ

బాపట్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : తెలుగు చలనచిత్ర సంగీత జగత్తులో ఘంటసాల తనకు తానే సాటి అని, తన గానామృతంతో సంగీత అభిమానుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన తెలుగు సంగీత ధ్రువతార ఘంటసాల అని సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. మంగళవారం ఘంటసాల 51వ వర్ధంతి కార్యక్రమంలో సాహితిభారతి కోశాధికారి ఆదం షఫి, ఉపాధ్యక్షుడు మద్రి మాల్యాద్రిరావు సంయుక్తంగా మాట్లాడుతూ ఘంటసాల తన గానామృతంతో ప్రేక్షకులను రంజింప చేశారని ఆయన తెలుగు, తమిళం, మలయాళం, హిందీ తదితర భాషలలో దాదాపు 660 సినిమాలలో 10 వేల పాటలకుపైగా గానం చేసి తెలుగు సినీ సంగీత గగనంలో ఆచంద్రార్కంగా నిలిచారన్నారు. అనంతరం రచయితలు బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కె.కాళీదాసు, కస్తూరి శ్రీనివారావు తదితరులు ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ

కొల్లూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : వృద్ధులకు నిత్యవసర సరుకులు గుంటూరుకు చెందిన సహృదయ సేవా సంఘం ప్రతినిధులు బాల బాలికలతో పంపిణీ చేయించారు. మంగళవారం కొల్లూరు గాంధీనగర్‌తో పాటు మండల పరిధిలో జువ్వలపాలెం, తడికలపూడి గ్రామాల్లో ఎంపిక చేసిన 28 మంది లబ్ధిదారులకు నేత్రదాత సుద్దపల్లి కృష్ణమూర్తి స్మారకార్థం బాల సభ విద్యార్థులతో 8 రకాల నిత్యావసరాలను పంపిణీ చేశారు. విద్యార్థుల్లో సామాజిక స్పృహ కల్పించాలనే ఉద్దేశ్యంతోనే వారితో పంపిణీ కార్యక్రమం చేయించడం జరిగిందని సంఘ ప్రతినిధులు తెలిపారు.

పార్వతీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన

అమృతలూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం గోవాడ శ్రీ బాలకోటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి లక్ష కుంకుమార్చన మంగళవారం ఘనంగా నిర్వహించారు. గూడవల్లికి చెందిన మైత్రేయ ఆశయం, గ్రామానికి చెందిన వేణుగోపాల్, లక్ష్మీ, సాయి భక్త సమాజం ఆధ్వర్యంలో అమ్మవారికి లక్ష కుంకుమార్చనతోపాటు, 10 వేల గులాబీలతో అలంకరించారు. ఆలయ అర్చకులు శ్రీధర్‌శర్మ పూజలు నిర్వహించారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి శాంతి కల్యాణం

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : చెన్నకేశవస్వామి శాంతి కల్యాణం అత్యంత వైభవోపేతంగా జరిగింది. మండల పరిధిలోని వెల్లటూరులో ఉన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో వార్షిక శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. స్వామి వారి కళ్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పూజాది కార్యక్రమాలను అర్చకులు తమిరిశ మారుతీ, యాజ్ఞికులు పెనుగొండ మురళి నిర్వహించగా ఆలయ కార్య నిర్వాహణాధికారి దీవి వెంకటప్పలాచార్యులు పర్యవేక్షించారు.

రామేశ్వర స్వామికి మాఘ సోమవార అభిషేకాలు

వేమూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మాఘ మాసం సోమవార పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని జంపని రామేశ్వరాలయంలో విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు మామిళ్లపల్లి వెంకటసుబ్బరాయ శర్మ తెల్లవారుజామున స్వామి వారికి ఏకాదశి రుద్రాభిషేకం జరిపి పంచసూక్తాలు నమక చమకాలు, పారాయణం చేశారు. అనంతరం స్వామి వారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేటి నుంచి దివ్యాంగుల పెన్షన్ల పునఃపరిశీలన

చెరుకుపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 1607 మంది దివ్యాంగుల పించన్లు పొందుతున్నారని, అందులో 683 మంది శారీరక అంగవైకల్యం, 117 మంది కంటి చూపు లోపం, 297 మంది వినికిడి లోపం, 330 మంది మానసిక వైకల్యం కలిగి నెలకు రూ.6 వేలు పింఛను పొందుతున్నారని, వారందరి పింఛన్ల పునఃపరిశీలన 12వ తేదీ నుంచి జరుగుతుందని ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని ఒక ప్రకటనలో తెలిపారు. కంటి చూపులోపం ఉన్న వారికి బాపట్ల ఏరియా హాస్పటల్‌లో, వినికిడి లోపం ఉన్నవారికి తెనాలి ఏరియాలో రోజుకు 25 మంది చొప్పున పునఃపరిశీలన చేస్తారని చెప్పారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించాలి

రేపల్లె, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం పట్టభద్రులను, న్యాయవాదులను కలసి లక్ష్మణరావు గెలుపునకు కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రైవేటు కళాశాలలో ఎమ్మెల్సీ ఓటు హక్కు కలిగిన అభ్యర్థుల దగ్గరకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

చెరుకుపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొన్నపల్లి, నడింపల్లి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఏడీఏ మహేష్‌బాబు ఫార్మర్ రిజిస్ట్రీ గురించి వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి చేపట్టిన ఈ రైతు నమోదు ప్రక్రియలో అందరు రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులను కలసి తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే రెండో పంట నమోదుకు ఈకేవైసీ కూడా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ పి.స్వాగతలక్ష్మి, ఏఈవో ఎం.తిరుపతమ్మ, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం పర్యటిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

బాపట్ల ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు-కృష్ణాజిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలంటూ బాపట్లలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పార్టీనాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 32వ వార్డులో ఇంటింటికెళ్లి కరపత్రాలను అందజేసి కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు రూపానందరెడ్డి, బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, బావుడా ఛైర్మన్ సలగల రాజశేఖరబాబు, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, మందపాటి ఆంధ్రేయ, బీజేపీ నాయకుడు బాల నారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు అభయహస్తం : వేగేశన

బాపట్ల పట్టణం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులైన 8 మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల సహాయార్థం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమ నిధి నుంచి చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అందజేశారు. బాపట్ల మండలం కుక్కలవారిపాలెం గ్రామానికి చెందిన రిత్విక్ కార్తీకేయరెడ్డి రూ.3,32,996, బాపట్ల మండలం అడవి గ్రామానికి చెందిన పి.గ్రీష్మంత్ రూ.3,01,490, బాపట్ల మండలం గుడిపూడి గ్రామానికి చెందిన గరికపాటి సత్యనారాయణకు రూ.37,292, కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామానికి చెందిన టి.సత్యవతి రూ.1,49,040, పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామానికి చెందిన ఆయిషా ఫిరోజ్‌కు రూ.6,11,121, పిట్టలవానిపాలెం మండలం గౌడపాలెం గ్రామానికి చెందిన ఉప్పాల వాణికి రూ. 20వేల చెక్కును అందజేశారు. అలాగే బాపట్ల ఇస్లాంపేటకు చెందిన మొబీనా, గాఫర్‌బేగ్‌లకు చెందిన ఏడాది పాపకు ఇన్‌ఫెక్షన్, డెంగీ జ్వరంతో ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్ళగా రూ.9 లక్షల మేర వైద్య ఖర్చులు అయ్యాయి. ఈ సమయంలో రూ.6 లక్షలు సీఎం రిలీఫ్‌ఫండ్ నిధులు రావటంతో తమ పాపకు ఊపిరి పోశారంటూ తల్లిదండ్రులు ఎమ్మెల్యే నరేంద్రవర్మకు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎంతో రుణపడి ఉంటామని ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ళల్లో వైసీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. సకాలంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, ఏఎల్‌వోసీలు అందించకుండా పేదల ప్రాణాలతో చెలగాటం ఆడిందన్నారు. కాని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఓ వైపు ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేస్తూనే వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు వైద్య ఖర్చులు భారం కాకుండా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, ఎఎల్‌వోసీలు అందజేస్తూ వారి ఆరోగ్యానికి బాసటగా నిలుస్తుందన్నారు.

పారిశుధ్య పనులను పర్యవేక్షించిన కమిషనర్



గార్బేజ్ లిఫ్టింగ్ పాయింట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి

బాపట్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని పలు వార్డులలో మంగళవారం తెల్లవారుజామున పారిశుధ్య పనులను బాపట్ల మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పరిశీలించారు. గడియార స్తంభం వద్ద గల గార్బేజి లిఫ్టింగ్ పాయింట్‌ను పరిశీలించి పట్టణంలో ఎక్కడా కూడా బ్లాక్ స్పాట్స్ లేకుండా చూడాలని పారిశుధ్య విభాగ సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం సూర్యలంక రోడ్డు భావపురి కాలనీ తదితర ప్రాంతాలలో పారిశుధ్య పనులను స్వయంగా పర్యవేక్షించారు. వార్డులలో నిరంతరం అంతర్గత రోడ్లను, డ్రైనేజీలను శుభ్రపర్చాలని, దోమల లార్వా వృద్ధి చెందకుండా డ్రెయినేజీలలో ఆయిల్‌బాల్స్‌ను ఉంచాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కరుణకు సూచనలు చేశారు. అనంతరం జమ్ములపాలెం రోడ్డులోని మున్సిపల్ డంపింగ్ యార్డును ఆయన పరిశీలించారు. ప్రతి రోజు పట్టణంలో సేకరించే చెత్త గుంటూరులోని జిందాల్ పవర్‌ప్లాంట్‌కు తరలించే విషయమై అక్కడ ఉన్న సిబ్బందితో మాట్లాడారు.

ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి అందజేయాలి : కమిషనర్

బాపట్లలోని ప్రజలు ప్రతి రోజు పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్త, హానికరమైన వ్యర్థాలను వేరు చేసిన తదుపరి మాత్రమే అందించాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలోని వివేకానంద కాలనీ మున్సిపల్ పార్క్‌ను మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న ప్రజలకు తడి, పొడి చెత్తల డెస్ట్‌బిన్స్‌ను ఆయన అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం ద్వారా ఆదర్శవార్డుగా వివేకానందకాలనీని ఎంపిక చేశామన్నారు. అనంతరం హోం కంపోస్ట్ విధానం, ఇతర పారిశుధ్య అంశాలు గురించి ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ జి.ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు సీహెచ్ కరుణ, డి.శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ, మెప్మా సీఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం, వివేకానంద కాలనీ సొసైటీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ర్యాగింగ్ విష సంస్కృతితో ప్రమాదం : సీఐ



కార్యక్రమంలో మాట్లాడుతున్న బాపట్ల పట్టణ సీఐ రాంబాబు

బాపట్ల ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ర్యాగింగ్ విష సంస్కృతి వికృత రూపంలో ఉంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బాపట్ల పట్టణ సీఐ రాంబాబు హెచ్చరించారు. బాపట్ల ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో మంగళవారం నిర్వహించిన ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఆహ్లాదాన్ని పెంచే వాతావరణంలో ఆత్మీయ పలకరింపులతో విద్యార్థుల నడవడిక ఉండాలని సూచించారు. జూనియర్లను వేధింపులకు గురి చేయాలన్న ఆలోచన వల్ల మొత్తం వాతావరణం కలుషితమయ్యే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. ఇటువంటి చర్యల వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందన్నారు. ర్యాగింగ్ పాల్పడేవారికి అనేక రకాల శిక్షలు ఉంటాయన్నారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు అన్ని విద్యాసంస్థలలో ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్, కళాశాల అసోసియేట్ డీన్ ఎం.ఎస్.బేగ్, ప్రొఫెసర్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించం : రూరల్ సీఐ



లాడ్జి, రిసార్ట్స్‌లలోని రికార్డులను పరిశీలిస్తున్న రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు

బాపట్లరూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండల పరిధిలో ఉన్న రిసార్ట్స్, హోటల్స్, లాడ్జీలు, దాబాలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలో ఉన్న అన్ని రిసార్ట్స్, హోటల్స్‌లో ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నేరాలను నియంత్రించటానికి అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయటానికి ముందస్తు చర్యలలో భాగంగా మండల పరిధిలోని రిసార్ట్స్, లాడ్జీలు, హోటల్స్, దాబాలు, రెస్టారెంట్‌లను సోమవారం రాత్రి తనిఖీ చేయటం జరిగిందన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్నా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటానికి అవకాశం ఉన్నా అలాంటి వారికి ఆశ్రయం కల్పించరాదన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు చోటు చేసుకుంటే వాటి యాజమాన్యంపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శబ్దకాలుష్యం నుంచి కాపాడండి



ఎస్పీతుషార్ డూడికి వినతి పత్రాన్ని అందజేస్తున్న సత్యప్రసాద్, డాక్టర్ సాయిబాబు

బాపట్ల ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాత్రి సమయాలలో శబ్దకాలుష్యం భారి నుంచి పట్టణ ప్రజలను కాపాడాల్సిందిగా బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విన్నకోట సత్యప్రసాద్, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు మంగళవారం ఎస్పీ తుషార్ డూడికి వినతిపత్రాన్ని అందజేశారు. రాత్రి 10 గంటలు తర్వాత ఉదయం 6గంటలలోపు ఎలాంటి లౌడ్‌స్పీకర్లకు అనుమతి మంజూరు చేయకుండా ఉండాలని ఎస్పీని కోరారు. ఈ సమయంలో విపరీతమైన శబ్దకాలుష్యం వల్ల నిద్రకు దూరమై ప్రజలు అనారోగ్యాల భారిన పడుతున్నారని అన్నారు. ప్రార్ధన స్థలాలలో లౌడ్‌స్పీకర్ల వినియోగంపై నిషేధం విధిస్తూ గత నెలలో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును వారు ఉటంకించారు. జిల్లాలో కూడా ముఖ్యంగా రాత్రి వేళల్లో శబ్దకాలుష్య నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వారు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఫోరం సభ్యులు గూడంశెట్టి వెంకటేశ్వర్లు ఉన్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాని గెలిపించాలని న్యాయవాదులను కోరుతున్న మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

ఆలపాటి విజయానికి కృషి చేయాలి : జంగా

రేపల్లె, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి అయిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని గెలిపించాలని రేపల్లె నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ జంగా కృష్ణమూర్తి అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల పాటి రాజాని గెలిపించాలని మంగళవారం నియోజకవర్గంలోని గ్రాడ్యుయేట్ ఓటర్లును, రేపల్లె బార్ అసోసియేషన్ న్యాయవాదులను, ఎంపీడీవో కార్యాలయంలోని ఉద్యోగులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీరప్రాంతంలోని వేమూరు, తెనాలి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేగా విధులు నిర్వహించి మంత్రిగా చేసి తీరప్రాంత అభివృద్ధికి కృషి చేశారన్నారు. అందరి సహకారంతో కూటమి అభ్యర్థి అయిన ఆలపాటి రాజాని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి మున్సిపల్ మాజీ ఛైర్మన్ వై.రామస్వామి, కొల్లూరు మాజీ ఎంపీపీ డాక్టర్ మధు, తడపా శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు, న్యాయవాది యరగళ్ళ ధర్మతేజ, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముస్తఫా అహ్మద్

● భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి ఎమ్మెల్సీ స్థానానికి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయానికి కూటమి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తఫా అహ్మద్ కోరారు. అద్దేపల్లి ముస్లిం షాదీఖానా వద్ద ముస్లింలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, వైసీపీ హయాంలో అన్ని వ్యవస్థలను జగన్మోహనరెడ్డి సర్వ నాశనం చేశారని విమర్శించారు. 75 సంవత్సరాల వయసులో కూడా చంద్రబాబు రాష్ట్ర సంక్షేమం కోసం ముఖ్యమంత్రిగా అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపు కోసం ప్రతి 30 మంది ఓటర్లను కార్యకర్తలు ప్రత్యేకంగా కలిసి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, ముస్లిం మైనారిటీ నాయకులు ఇర్ఫాన్ బేగ్, సోహెల్, ఇస్మాయిల్ నబీ, తాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి మద్దతుగా పొన్నపల్లిలోని మేరీరోజ్ బడ్స్ పాఠశాలలో ఉపాధ్యాయులు నేతలు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు కొలసాని తులసి విష్ణుప్రసాద్, కొల్లూరు మండల టీడీపీ నేతలు మైనేని రత్నప్రసాద్, కనగాల మధుసూదన్‌ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, గూడవల్లి బాలభారతి పాఠశాల కరస్పాండెంట్ బృందావనం, హయగ్రీవాచార్యులు తదితరులు పాల్గొని ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో దిగిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని గెలిపించాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు.

మాజీ సర్పంచ్ రావి సుందరారెడ్డి మృతి తీరనిలోటు

● మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి



సుందరారెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న చీరాల గోవర్ధనరెడ్డి తదితరులు

కర్లపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మాజీ సర్పంచ్ రావి సుందరారెడ్డి మృతి తీరనిలోటు అని టీడీపీ సీనియర్ నాయకుడు, బాపట్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి అన్నారు. రావి సుందరారెడ్డి భౌతికకాయానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబానికి తన ప్రగాడ సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోదుగుల శంకరరెడ్డి, బాల శివారెడ్డి, డేగుల రవిరెడ్డి తదితరులు ఉన్నారు.

పోటీలలో ప్రతిభ చాటిన బాపట్ల కాలేజి ఆఫ్ విద్యార్థులు



బహుమతి అందుకుంటున్న బాపట్ల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థిని పవిత్ర

బాపట్లరూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల క్యూఐఎస్ కాలేజి ఒంగోలులో జరిగిన క్యూఐఎస్ ఫెస్ట్-2025లో బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు పలు అంశాలలో ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. ఆయన మాట్లాడుతూ బీ ఫార్మసీ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి కె.వినయ్ ఫొటోగ్రఫీ కాంటెస్ట్‌లో ప్రథమ బహుమతి సాధించారని, బీ ఫార్మసీ మూడో సంవత్సరం చదువుతున్న ఎ.పవిత్ర లాంగ్‌జంప్ పోటీలో ద్వితీయ బహుమతి గెలుపొందారని తెలిపారు. విద్యార్థులు చదువుతో సమానంగా స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా సర్క్యులర్ అథ్లెటిక్స్‌లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విజేతలను బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరి మానం నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ అభినందించారు.

ధర్మరక్ష నిధికి విరాళం

చెరుకుపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : సమరసత సేవా ఫౌండేషన్ ధర్మనిధి సేకరణలో భాగంగా మంగళవారం జిల్లా బ్రాహ్మణ సేవా సమైఖ్య అధ్యక్షుడు రావూరి ఆంజనేయశర్మ జిల్లా దేవాలయాల ప్రముఖ్ చెరుకుపల్లి మండల కన్వీనర్ పొన్నపల్లి సత్యనారాయణకు రూ.1512 ధర్మరక్ష అందించారు. వారికి ప్రాంత కమిటీ సభ్యులతో జిల్లా కమిటీ సభ్యుల ద్వారా అభినందనలు తెలియజేశారు.




వరహాపురం సచివాలయంలో రీసర్వే నివేదికలు పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

భూ యజమాని లేకుండా రీసర్వే నిర్వహించవద్దు

● రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి

వేమూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : భూ రీసర్వే నిర్వహించేటప్పుడు భూ యజమానులు తప్పనిసరిగా హాజరయ్యే విధంగా సర్వేయర్లు బాధ్యత వహించాలని, విదేశాలలో కానీ, సుదూర ప్రాంతాల్లో కానీ యజమానులు ఉంటూ సర్వేకి హాజరు కాలేని పక్షంలో వారి పక్షాన ఒకర్హా వ్యక్తి హాజరయ్యే విధంగా చూడాలని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. ఆమె మండలంలోని వరహాపురం గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీ సర్వే కార్యక్రమాన్ని, వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాములలో నిల్వ చేసిన రేషన్ సరుకు విలువలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వరహాపురం సచివాలయంలో భూ సర్వేకి సంబంధించిన నివేదికను ఆన్‌లైన్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేయర్లు, వీఆర్వోలకు సూచనలు ఇచ్చారు. సర్వే జరిపే సందర్భంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం అయినప్పటికీ వాటిని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కోర్టు వ్యవహారాల్లో ఉన్న భూముల సర్వేను వాటి పరిష్కారం అయిన తదుపరి సర్వే నిర్వహించాలని తెలిపారు. యార్డు గోదాములలో ఉన్న రేషన్ బియ్యం, పంచదార నిల్వలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖతో మాట్లాడుతూ, రేషన్ పాత నిల్వలను ఎప్పటికప్పుడు వెనక్కి పంపాలని, వాటి వివరాలను ఆన్‌లైన్ ద్వారా ఎప్పటికప్పుడు రికార్డు చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు పాఠశాలలకు సరఫరా చేసే బియ్యాన్ని సకాలంలో అందించాలన్నారు. వినియోగదారులకు రేషన్ కార్డుల ఆధారంగా పంపిణీ చేసే బియ్యం, పంచదారను డీలర్లకు కేటాయించిన తేదీల లోపు పంపిణీ చేయాలన్నారు. తూకాలలో తేడా వచ్చినా, అవినీతికి ఎవరైనా పాల్పడినా అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ సుశీల, డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయి, మండల సర్వేయర్లు నాగేశ్వరరావు, షణ్ముఖ, వీఆర్వోలు జితేంద్ర, సామ్రాజ్యం, కోటేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

87 ఏళ్ళ వయస్సులో కూడా పతకాలు సాధించిన వెంకటరామారావు



అథ్లెటిక్స్ పోటీలలో బహుమతులు అందుకుంటున్న వెంకటరామారావు

బాపట్ల ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : 44వ నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ పోటీలు రాజస్థాన్‌లో నిర్వహించగా 87 ఏళ్ళ బాపట్ల భీమవరంనకు చెందిన క్రీడాకారుడు లేళ్ళ వెంకటరామారావు పోటీలలో పాల్గొని బహుమతులను సాధించారు. జావలిన్ త్రోలో బంగారుపతకం, డిస్కస్ త్రో, షార్ట్‌పుట్‌లో కాంస్య పతకాలు సాధించి రాజస్థాన్‌కు చెందిన ఆర్గనైజింగ్ సెక్రటరి జీత్‌కౌర్ చేతులమీదగా బహుమతులు అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొని గోల్డ్‌మెడల్స్ 96, సిల్వర్ 40, కాంస్య పతకాలు 20 సాధించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

వైభవంగా బాలకోటేశ్వరస్వామి కల్యాణం

అమృతలూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవ కమిటీ ఛైర్మన్ పావులూరి రమేష్ దంపతుల సహకారంతో బాలకోటేశ్వరస్వామి, పార్వతీదేవి ఉత్సవ విగ్రహాలకు మంగళవాయిద్యాల నడుమ కన్నుల పండగగా ఆలయ అర్చకులు స్వర్ణ వెంకట శ్రీనివాసశర్మ, శ్రీధర్ శర్మలు కల్యాణం నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణం తిలకించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఆలయ ఈవో అశోక్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

బాపట్ల డిపో ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

బాపట్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల కొత్త బస్టాండ్‌లో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని బాపట్ల డిపో మేనేజర్ బి.శ్రీమన్నారాయణ ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరం బాపట్ల ఏరియా వైద్యశాల వైద్యులు కోటేశ్వరరావు సిబ్బందితో ఏర్పాటు చేయగా మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించారు. డిపో మేనేజర్ రక్తదానం చేయటమంటే ఆపదలో ఉన్న మరొక ప్రాణాన్ని కాపాడటమే అని పిలుపునివ్వగా డిపోలోని ఉద్యోగులు అదే స్ఫూర్తితో ముందుకొచ్చి 20 మందికి పైగా రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి పండ్లు, పండ్లరసం, ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జి పి.నాగేశ్వరరావు, అసోసియేషన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయకు నివాళి

బాపట్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా కార్యాలయంలో పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ అధ్యక్షుడు బ్రహ్మాండం బాలనారాయణ, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు స్థానం బాలగంగాధర్ తిలక్, నరాలశెట్టి శ్రీనివాసరావు, మామిడి రమేష్, ప్రసాద్, వల్లూరి భావన్నారాయణ, బాపట్ల మండల అధ్యక్షుడు పేరెడ్డి, శ్రీహరి, భావన్నారాయణ, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే అభివృద్ధి


● శ్రీ సత్యసాయి సేవా సంస్థల గ్రామీణ సేవా విభాగం ఇన్‌చార్జి తుమ్మల

కర్లపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే అన్నిరంగాల్లో అభివృద్ధి చెందవచ్చునని బాపట్ల జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థల గ్రామీణ సేవా విభాగం ఇన్‌చార్జి తుమ్మల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో ఉన్న 200 మంది విద్యార్థులకు మంగళవారం ఉచితంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని బాపట్ల జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు ఎం.రాంబాబు ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ వైద్య శిబిరంలో విద్యార్థులను పరీక్షించి ఎం.రవికుమార్ సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు చంద్రరెడ్డి, సుబ్బారావు, కె.సుబ్బారావు, జి.వెంకటేశ్వరరావు, బి.సంగమేశ్వరశాస్త్రి, ఎ.వెంకటేశ్వరరావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోలీసురావు, మాస్టర్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు రీసర్వే ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోమలి గ్రామ పంచాయతీలో గత నెల 20వ తేదీ నుంచి జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ ధూళిపూడి వెంకటేశ్వరరావు మంగళవారం సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కోమలి గ్రామపంచాయతీలో 1198 ఎకరాల విస్తీర్ణాన్ని ఇప్పటికి నాలుగు బ్లాక్‌లుగా విభజించి నాలుగుటీమ్‌లు చేస్తున్న సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ఆదిరామచంద్రరావు, ఆర్ఐ జె.శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్లు, గ్రామ, మండల రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలపై.. నిర్లక్ష్యం



నాగులేటి పైతీరాన నిర్మించిన ఎత్తిపోతల పథకం మోటార్ల గది



ఎత్తిపోతల పథకానికి నీరందించేందుకు నాగులేటిలో నిర్మించిన బావి

ఆ గ్రామానికి చెంతనే కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది.. గ్రామంలో ఎత్తిపోతల పథకమూ ఉంది.. అయితే పైపులైన్ల మరమ్మతులతో గ్రామానికి తాగు, సాగు నీరు అందకుండా పోతోంది.. సుమారు రూ. 3.85 కోట్లతో నిర్మించిన పథకం ఏళ్ల తరబడి వినియోగానికి నోచుకోక మూలనపడింది.. గుత్తేదారు అలసత్వం, అధికారుల పర్యవేక్షణ లోపం, పాలకుల నిర్లక్ష్యంతో ఈ పథకం అభాసుపాలవుతోంది.. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి రాజకీయ నేతల వాగ్దానాలతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయే తప్ప నేతల హామీలు మాత్రం నెరవేరడం లేదు.

- రూ. 3.85 కోట్లతో నిర్మాణం
- లీకుల రిపేరుతో వినియోగంలోకి
- నిరుపయోగంగా మోటార్లు
- ప్రశ్నార్థకంగా 1255 ఎకరాలకు సాగునీరు

కారంపూడి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కారంపూడి మండలం పేటసన్నిగండ్ల గ్రామంలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. సాధారణంగా గ్రామ రైతులు నీటి బోరుల కింద పంటలు సాగు చేస్తారు. వరి, మిర్చిని ఇక్కడి రైతులు ప్రధానంగా సాగు చేస్తుంటారు. ఉదాహరణకు అక్కడ ఒక పొలంలో సుమారు 500 అడుగుల లోతులో బోరు వేస్తే నీరు పడింది అనుకోండి. పక్క పొలం రైతు 600 అడుగులు బోరు వేస్తే 500 అడుగులు వేసిన బోరు ఎండిపోతోంది. అదే ఇంకో రైతు 700 అడుగులు బోరు వేస్తే, ఇంతకు ముందు వేసిన బోర్లు ఎండిపోతాయి. ఇలా సాగునీటి కోసం రైతులు పెచ్చు అడుగుల మేర డ్రిల్లింగ్ చేస్తుండడంతో ముందుగా బోరు ఏర్పాటు చేసుకున్న పొలాలకు నీరు రాకుండా పోతోంది. దీంతో రైతులకు పంట సాగు ప్రశ్నార్థకంగా మారింది.

సుమారు రూ. 3.85 కోట్లతో..

రైతుల పరిస్థితి ఇలా ఉండడంతో 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేసింది. ఇందుకు కోసం సుమారు రూ. 3.85 కోట్ల నిధులు కూడా మంజూరు చేసింది. అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి లక్ష్మారెడ్డి ఈ పథకానికి శంకుస్థాపన చేశారు. గుత్తేదారు నాగులేటి పైభాగాన పథకం పనులకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం నాగులేటి పైభాగాన మోటార్ల గది, బావి ఏర్పాటు చేశారు. బావిలో నుంచి పైపులైన్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా పొలాలకు నీరందేలా ఏర్పాటు చేశారు. 2007 నుంచి సాగిన ఈ పనులు 2011కు పూర్తయ్యాయి. పథకం పూర్తికాగానే సాగునీటిని విడుదల చేశారు. ఈ పథకం బాధ్యతను ప్రభుత్వం చిన్న తరహా నీటి పారుదల శాఖకు అప్పగించింది. ఈ పథకం కింద 1255 ఎకరాల దాకా సాగు కానుంది. అయితే ఒక్క ఏడాదిపాటు కూడా ఈ పథకం సత్ఫలితాలు ఇవ్వలేదు.

టీడీపీ ప్రభుత్వ హయాంలో..

అయితే పథకం పూర్తయిన ఏడాదిలోపే పైపులైన్లు లీకేజీలకు గురయ్యాయి. దీంతో చివరి భూములకు చుక్క నీరు కూడా అందే పరిస్థితి లేకపోయింది. క్రమేణా లీకేజీలు ఎక్కువవడంతో పరిస్థితి మొదటకు వచ్చింది. కాగా 2014లో టీడీపీ అధికారం చేపట్టడంతో రైతులు తమ దయనీయ స్థితిని పాలకుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం స్పందించి పైపులైన్ల లీకేజీల మరమ్మతులకు రూ. 4.85 లక్షలు నిధులు మంజూరు చేసింది. అయితే గుత్తేదారు లీకేజీల మరమ్మతుల పనులు చేపట్టకుండా తప్పుకున్నాడు. దీనిపై రైతులు చిన్న తరహ నీటి పారుదల శాఖ అధికారులకు విన్నవించుకోగా మీరంతా సంఘంగా ఏర్పడి సమస్యను పరిష్కరించుకోవాలని ఉచిత సలహా ఇచ్చారు. అయితే సంఘం ఏర్పడింది లేదు.. సమస్య పరిష్కారమైందీ లేదు. అయితే అధికారులు మాత్రం ప్రతి ఏటా వచ్చి పథకం పూర్తి చేస్తామని కబుర్లు చెప్పి వెళ్లిపోతున్నారు. ఈ పథకం కాలక్రమేణా చిన్న తరహ నీరు పారుదల శాఖ నుంచి ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ పరిధిలోకి వెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పాలకులు సైతం ఈ పథకం వినియోగంలోకి తీసుకొస్తామని హామీలు ఇస్తున్నారే గానీ అమలుకు మాత్రం నోచుకోవడం లేదు. రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని వినియోగంలోకి తీసుకొస్తుందని ఇక్కడ రైతాంగం కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు.



ముళ్ల పొదల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు


పదేళ్లుగా ఎదురుచూపు



గ్రామంలోని ఎత్తిపోతల పథకం వినియోగంలోకి వస్తుందని పదేళ్లుగా ఎదురుచూస్తున్నాం. కోట్ల రూపాయలతో నిర్మించిన పథకం యేడాదికే మూలనపడింది. ఈ పథకం కింద 1255 ఎకరాలు సాగవుతుంది. లీకేజీల మరమ్మతులకు నిధులు మంజూరైనప్పటికీ పనులు పూర్తి కాక పోవడం దురదృష్టకరం.

చావా వీరాంజనేయులు, రైతు, పేటసన్నిగండ్ల

నీరందించి పంటలకు ప్రాణం పోయాలి



ఈ ప్రాంతంలో వరి, మిర్చి అధికంగా సాగవుతుంది. సరైన సమయంలో వర్షం పడితే తప్ప పంట చేతికొచ్చే పరిస్థితి లేదు. గ్రామంలోనే ఎత్తిపోతల పథకం ఉన్నప్పటికీ సాగునీరు అందడం లేదు. పాలకులు, అధికారులు సమస్యను పరిష్కరించి పొలాలకు నీరందించి పంటలకు ప్రాణం పోయాలి.

గాడిపర్తి పూర్ణయ్య, రైతు, పేటసన్నిగండ్ల

నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం

ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏఈ వెంకటయ్య

ఎత్తిపోతల పథకానికి సంబంధించి పైపులైను లీకేజీల సమస్య ఏర్పడింది. లీకేజీల మరమ్మతులకు గతంలో నిధులు మంజూరైనప్పటికీ పనులు పూర్తి కాలేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే మరమ్మతు పనులు ప్రారంభిస్తాం.

బతుకు పోరాటం...



జానెడు పొట్ట నింపుకోవటం కోసం మురుగులో నిలబడి చెత్తలో ప్లాస్టిక్ బాటిళ్లను ఏరుకుంటున్న దృశ్యం
-గుంటూరు, ఆంధ్రజ్యోతి

రసవత్తరంగా సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీ

- ఉత్కంఠ పోరులో ఏపీ-తెలంగాణపై తమిళనాడు విజయం
- మరో మ్యాచ్‌లో కేరళపై కర్ణాటక గెలుపు



పోటీల్లో తలపడుతున్న ఏపీ-తెలంగాణ, తమిళనాడు జట్లు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ప్రిన్సిపల్ ఎకౌంటెంట్ జనరల్ కార్యాలయం నేతృత్వంలో ఇండియన్ ఆడిట్స్, ఎకౌంట్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న ఐఏ అండ్ ఏడీ సౌత్‌జోన్ క్రికెట్ టోర్నమెంటు రసవత్తరంగా సాగుతుంది. టోర్నీలో భాగంగా రెండో రోజు జరిగిన రెండు మ్యాచ్‌లు ఉత్కంఠ భరితంగా సాగాయి. ఏపీ-తెలంగాణ రాష్ట్రాల జట్టు, తమిళనాడు మధ్య జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ఏపీ-తెలంగాణ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. యశ్ కొఠారి 57 బంతుల్లో 77, తరుణ్ 27 పరుగులు చేయగా, తమిళనాడు బౌలర్లు అశ్విన్ బాలాజీ, రవితేజ డీబీ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అశ్వత్ శ్రీధర్ 3 ఓవర్లలో కేవలం 6 పరుగులు మాత్రమే ఇచ్చి స్కోరును కట్టడి చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తమిళనాడు జట్టు 18 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. ఆఖరి రెండు ఓవర్లలో 27 పరుగులు చేయవలసి వుండగా, 19 ఓవర్‌లో కేవలం 4 పరుగులు మాత్రమే వచ్చాయి. దీంతో చివరి ఆరు బంతుల్లో 23 పరుగులు చేయాల్సి వుండగా, ఏపీ-తెలంగాణ జట్టు గెలుపు ఖాయమని అంతా భావించారు. అయితే, తమిళనాడు బ్యాటర్ ఫ్రాన్సిస్ రోకిన్స్ వరుసగా రెండు సిక్సర్లు బాది, మూడో బంతికి అవుటయ్యాడు. 3 బంతుల్లో 11 పరుగులు చేయాల్సి వుండగా, బ్యాటింగ్‌కు దిగిన విఘ్నేష్ ఒక్క పరుగు తీసి వేదాంత్ భరద్వాజ్‌కు స్ట్రైకింగ్ ఇచ్చాడు. భరద్వాజ్ చివరి రెండు బంతులను వరుసగా ఫోరు, సిక్సు బాదడంతో ఉత్కంఠ పోరులో తమిళనాడు విజేతగా నిలిచింది.

కర్ణాటక, కేరళ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో కర్ణాటక టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. కేరళ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసింది. కేరళ బ్యాటర్లు సచిన్ 29, శ్యాంసన్ 24 పరుగులు చేయగా, కర్ణాటక బౌలర్లు దర్శన్ 3, అర్జున్ గౌడ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక జట్టు కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. 8 వికెట్ల తేడాతో ఘనవిజయం నమోదు చేసింది. కర్ణాటక బ్యాటర్లు అభిరాత్ రెడ్డి 37 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 50 పరుగులు, అర్జున్ హోయసాలా 25 బంతుల్లో 41 పరుగులు చేశారు. కేరళ బౌలర్లు మణికృష్ణన్, మిథులు చెరో వికెట్ పడగొట్టారు. రెండు మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను సీనియర్ డిప్యూటీ ఎకౌంటెంట్ జనరల్స్ భాస్కర్ కల్లూరు, కిశోర్‌రెడ్డి, ఆర్.శ్యామ్, రాకేష్ నాయక్, ఎన్.నిఖిలలు అభినందించారు. కాగా, బుధవారం ఉదయం కేరళ, తమిళనాడు, మధ్యాహ్నం ఏపీ-తెలంగాణ, కర్ణాటక జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.

పీజీఆర్‌ఎస్‌లో మెరుగుపడిన
గుంటూరు జిల్లా పనితీరు

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్(పీజీఆర్‌ఎస్)లో గుంటూరు జిల్లా పనితీరు మెరుగుపడింది. మంగళవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో సెక్రెటరీలతో సీఎం, మంత్రులు నిర్వహించిన సమీక్ష అనంతరం స్కోర్లను విడుదల చేశారు. ఇతర జిల్లాలతో పోల్చితే ప్రతి సోమవారం వచ్చే గ్రీవెన్స్‌లను చాలావరకు అధికారులు తగ్గించగలిగారు. వాటి పరిష్కారం విషయంలో 20 మార్కులకు 19.91 స్కోరుని జిల్లా సాధించింది. అలానే గ్రీవెన్స్‌ల పరిష్కారం నాణ్యతతో స్కోర్ కాస్త తగ్గింది. 13.35గా ప్రభుత్వం ప్రకటించింది. వీఐపీ క్లోజర్ రేట్ స్కోరు 20కి 20గా ఉన్నది. అయితే వీఐపీ క్వాలిటీ స్కోరు మాత్రం 9.93గా ఉన్నది. కాగా చాలా పిటీషన్లను వీఆర్‌వోలకు పంపుతున్నారు. వీఆర్‌వోలు పంపే రిపోర్టు ఆధారంగా అధికారులు వాటిని అప్‌లోడింగ్ చేసేస్తున్నారు. ఎవరూ కూడా నేరుగా వెళ్లి పిటీషన్లను కలవడం లేదు. సుపీరియర్ అధికారుల్లో కనీసం తహసీల్దార్ స్థాయి అధికారి కూడా వ్యక్తిగత ఎంక్వయిరీ నిర్వహించడం లేదని ప్రభుత్వం పేర్కొన్నది. ఆర్‌వోఆర్ కేసుల్లో ఆఫీసర్లు ఎండార్స్‌మెంట్‌లు అప్‌లోడింగ్ చేస్తూ పిటీషనర్‌కి ఆర్‌వోఆర్ కేసుని కాంపిటెంట్ అథారిటీ ఎదుట ఫైల్ చేయాలని సూచిస్తున్నారు. ప్రాథమిక ఎంక్వయిరీ నిర్వహించడం లేదు. ఈ నేపథ్యంలో అధికారులు తప్పనిసరిగా ఎంక్వయిరీ నిర్వహించి సమగ్ర నివేదికని కాంపిటెంట్ అథారిటీకి పంపాలని ఆదేశించింది. కొన్ని కేసుల్లో పిటీషనర్ల పేర్లను వెబ్‌ల్యాండ్‌లోనే మాయం చేస్తున్నారు. దాంతో పిటీషనర్ హైకోర్టులో కేసులు దాఖలు చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు చాలా మంది ఎలాంటి విచారణ చేయకుండానే హైకోర్టు ఆదేశాను సారం సమస్య పరిష్కరిస్తామనఇ చెబుతున్నారు. గతంలో నీటి వనరుల్లో అసైన్‌మెంట్ పట్టాలు జారీ చేశారు. అలానే వాటికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చి వెబ్‌ల్యాండ్‌లో కూడా ఎక్కించారు. రీసర్వే సమయంలో భూవినియోగం ప్రొసీడింగ్స్ అందుబాటులో లేదని పేర్కొంటూ పేర్లు తొలగించారు. ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణకు గురైన కేసుల్లో చట్ట ప్రకారం చర్యలు తీసుకొంటామంటున్నారే తప్పా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వీటన్నింటిని సరి చేసుకోవాలని సూచించింది.

నేటి నుంచి మూడు రైళ్ల రద్దు

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెనాలి రైల్వేస్టేషన్‌లో కొత్త ప్లాట్‌ఫాం నిర్మాణం కారణంగా ఈ నెల 12వ తేదీ నుంచి మార్చి 13వ తేదీ వరకు 30 రోజుల పాటు మూడు రైళ్లను రద్దు చేస్తున్నామని డీఆర్ఎం ఎం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 67221 విజయవాడ - తెనాలి, 67231 తెనాలి - రేపల్లె, 67332 రేపల్లె - తెనాలి రైళ్లను రద్దు చేస్తున్నామన్నారు. నంబరు. 67224 రేపల్లె - తెనాలి రైలుని ఆయా తేదీల్లో 60 నిమిషాల పాటు రీషెడ్యూల్ చేయడం జరుగుతుందన్నారు.

అమరావతికి హడ్కో రుణం

- రూ.11 వేల కోట్లు మంజూరు
- ఇప్పటికే ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి రూ.15 వేల కోట్ల అప్పు
- త్వరలో కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్లు

విజయవాడ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్లేందుకు హడ్కో రూ.11 వేల కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. హడ్కో జాయింట్ జనరల్ మేనేజర్(జేజీఎం) ఎస్ఎం శ్రీనివాస్, జేజీఎం(ప్రాజెక్ట్స్) కె.విజయ కుమార్ మంగళవారం విజయవాడలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబును కలిసి రుణ మంజూరు పత్రాలను అందించారు. రుణపత్రాలను స్వీకరించినప్పటి నుంచి నాలుగు నెలల్లో లోన్ అగ్రిమెంట్ వ్యవహారాలను పూర్తి చేసుకోవాలని హడ్కో ప్రతినిధులు కమిషనర్‌కు చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసానికి గురైన అమరావతి రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు కూటమి ప్రభుత్వం అమరావతి 2.0కు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. రాజధానిలో పునర్నిర్మాణ పనులకు రూ.48,012.67 కోట్ల వ్యయంతో ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఐఏఎస్, ఏపీఎన్‌జీవో, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు, ప్రిన్సిపల్ సెక్రటరీ బంగ్లాలు, జడ్జీల క్వార్టర్లు, గవర్నమెంట్ టైప్-1, 2 భవనాలు, ప్రధాన రోడ్ల పునర్నిర్మాణ పనులు, హ్యాపీనెస్ట్, సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయాల పునర్నిర్మాణాలు, ఎల్‌పీఎస్ జోన్లలో మౌలిక సదుపాయాల కల్పన పనులు, ట్రంక్ ఇన్‌ఫ్రా పనులు, అమరావతి వరద నియంత్రణ పనులు తదితర అనేక ముఖ్యమైన పనులకు టెండర్లు పిలిచేందుకు సీఆర్‌డీఏ, ఏడీసీ సిద్ధమయ్యాయి.ఈ క్రమంలో ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.31 వేల కోట్ల రుణాన్ని పొందేందుకు సీఆర్‌డీఏ ప్రయత్నాలు చేసింది. ఇప్పటికే ప్రపంచ బ్యాంకు, ఏడీబీల నుంచి రూ.15 వేల కోట్ల రుణం మంజూరైంది. ఆ పత్రాలు కూడా సీఆర్‌డీఏకు అందాయి. ఇదే సందర్భంలో హడ్కో నుంచి రూ.11 వేల కోట్ల రుణం, జర్మనీకి చెందిన డెవలప్‌మెంట్ బ్యాంక్ కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్ల రుణం పొందేందుకు ప్రయత్నాలు చేపట్టారు. హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ కూడా రుణం ఇవ్వటానికి మౌఖికంగా అంగీకరించాయి.

ముగిసిన ఎడ్ల బలప్రదర్శన పోటీలు

సీనియర్స్ విభాగంలో వేటపాలెం ఎద్దుల ప్రథమ స్థానం

మాచవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్జంపాడులో శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు మంగళవారంతో ముగిశాయి. సీనియర్స్ విభాగంలో జరిగిన పోటీల్లో బాపట్ల జిల్లా వేటపాలేనికి చెందిన అత్తోట శిరీషచౌదరి, శివకృష్ణచౌదరి ఎద్దుల ప్రథమ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా పెదకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి, తెలంగాణ రాష్ట్రం హుజూర్‌నగర్‌కు చెందిన సుంకు సురేందర్‌రెడ్డి కంబైన్డ్ జత రెండో స్థానంలో, నంద్యాల జిల్లా గుంపుమాందిన్నె గ్రామానికి చెందిన కుందూరు రామ్‌భూపాల్‌రెడ్డి ఎద్దులు మూడో స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా ఇనిమెట్ల గ్రామానికి చెందిన కటకం లక్ష్మణ్ కుమార్ కంబైన్డ్ జత ఐదో స్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతులతో పాటు షీల్డులు బహూకరించారు.

జూనియర్స్ విభాగంలో బాపట్ల ఎద్దుల ప్రథమ స్థానం

జూనియర్స్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన అత్తోట శిరీషచౌదరి, శివకృష్ణచౌదరి ఎద్దుల ప్రథమ స్థానంలో నిలిచాయి. హైదరాబాద్‌కి చెందిన డీ రోహన్‌బాబు ఎద్దుల రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. పెదనందిపాడు మండలం నాగులపాడుకి చెందిన ఆలా మోహనరావు, పాటిబండ్ల శ్రీనివాసరావు కంబైన్డ్ జత నాల్గో స్థానంలో, లింగాయపాలేనికి యల్లం సాంబశివరావు ఎద్దులు ఐదో స్థానంలో, కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం నాదెండ్లవారిపాలేనికి చెందిన కాకర్ల సురేష్‌బాబు ఎద్దులు ఆరో స్థానంలో, నరసరావుపేట మండలం పమిడిమర్రుకి చెందిన ఎర్రసాని సుబ్బయ్య ఎద్దులు ఏడో స్థానంలో నిలిచాయి. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కృష్ణా జిల్లా పెనుమత్స గ్రామానికి చెందిన సూరపనేని రాధాకృష్ణ, దుర్గికి దుగ్గి శ్రీనివాసరావు వ్యవహరించారు.



గెలుపొందిన యజమానులకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

మండలి బరిలో.. 30 మంది

(5వ పేజీ తరువాయి)

కనకం శ్రీనివాసరావు, యెంద్రెడ్డి శివారెడ్డి, గుడిశ రాంబాబు, బోట్ల శివసత్యన్నారాయణ, గుణుకుల వెంకటేశ్వర్లు, గౌతుకట్ల అంకమ్మరావు, డేగల సైదారాజు, కందుల వెంకటరావు, చుండూరు సత్యబాలసుందర రామశర్మ, లగడపాటి వేణుగోపాల్, జూపూడి శ్యాంప్రసాద్, మంత్రి బాలకృష్ణ, మేరిగ మోహనరావు, మురకొండ చంద్రశేఖర్, గంటా మమత, గుమ్మా శ్రీనివాసరావు, షేక్ ఉమర్‌బాషా, తిరువీధుల శారద, వై వినయ్‌కుమార్ తంబి, గంగోలు శామ్యూల్, షేక్ అహ్మద్, ఆరిగల శివరాంప్రసాద్, ఎం రామకోటయ్య, డీ విక్రం, వై శోభారాణి, దుక్కిపాటి రాధాకృష్ణమూర్తి, అన్నవరపు ఆనంద కిషోర్, పులుగు దీపక్ నామినేషన్లను ఆమోదించారు. ఓటర్ల జాబితాలో పేర్లు సరిపోకపోవడం తదితర కారణాలతో షేక్ కరిముల్లా, చిలక వెంకయ్య, లింగం జాన్‌బెన్నీ, పీఎస్‌వీఎన్ హరికిషన్, వరగాని ఏడుకొండలు, అంబల్ల రాజకుమార్, బసవ వంశీకృష్ణ, జాలాది అనీల్‌కుమార్, పప్పూరి వెంకటఅశోక్ నామినేషన్లను తిరస్కరించారు. ఎవరెవరి అభ్యర్థిత్వాలను ఆమోదించింది, తిరస్కరించింది, అందుకు కారణాలను పేర్కొంటూ ప్రొసీడింగ్స్‌ని ఆర్‌వో జారీ చేశారు.

రేపటి వరకు ఉపసంహరణ గడువు

కాగా నామినేషన్ల ఉపసంహరణకు గడువు సమయం ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు ఉన్నది. ఆ తర్వాత తుది అభ్యర్థుల జాబితాని ఎన్నికల సంఘం నిబంధనల మేరకు రూపొందించి విడుదల చేస్తారు. ఆ వెంటనే బ్యాలెట్ పేపర్ ముద్రణ ప్రక్రియని చేపడతారు. నామినేషన్ల పరిశీలనలో జేసీ భార్గవతేజ, ఏఆర్‌వో షేక్ ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ తేదీ సమీపిస్తున్నందున ఓటర్లకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల అధికారులను ఆర్‌వో నాగలక్ష్మి ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లపై పల్నాడు, బాపట్ల, ఎన్‌టీఆర్, కృష్ణ, ఏలూరు జిల్లాల కలెక్టర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో మంగళవారం సాయంత్రం ఆమె గుంటూరు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌వో మాట్లాడుతూ సాధారణ ఎన్నికలతో పోల్చితే ఎమ్మెల్సీ ఓటింగ్ భిన్నంగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఓటర్లకు తమ ఓటుని ఎలా వేయాలి అనే దానిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణపై పీవో, ఏపీవో, ఓపీఓలకు ఈ వారంలో శిక్షణ నిర్వహిస్తామన్నారు.

విచ్చలవిడి.. వినియోగం

(5వ పేజీ తరువాయి)

ఏ మాత్రం తేడా రాదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. యూరియా, సూపర్ పాస్ఫేట్, ఎం.ఓ.పి, డీఏపీ, 20:20:0, 28:28:0, 14:35:14, 10:26:26 తదితర ఎరువులతో కలిపి పోషకాల సిఫార్సును బట్టి వేయాలి. అంతేగాక రైతులు కాంప్లెక్స్ ఎరువులను పై పాటుగా విత్తిన, నాటిన నెల తర్వాత కూడా వేస్తున్నారని అధికారులు తెలిపారు. దీనివల్ల కాంప్లెక్స్ ఎరువులోని భాస్వరం పంటకు ఏమాత్రం ఉపయోగపడకపోగా జింకు, ఇనుము ఇతర పోషకాలతో కలిసి నేలలో స్థిరీకరింపబడి వాటిని కూడా మొక్కలకు అందకుండా చేస్తుందంటున్నారు.

సూచనలు పాటించాలి



ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల నష్టం తప్ప లాభం లేదు. ఈ విషయంలో రైతులు కచ్చితంగా వ్యవసాయ శాఖ సూచనలు, సలహాలు పాటిస్తే మేలు జరుగుతుంది. రబీలో వరి, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ పంటలకు తగిన మోతాదులో మాత్రమే ఎరువులు వేయాలి. ఎరువుల వాడకం పెరిగిపోతే భూమి తన సహజగుణం కోల్పోతుంది. ఎరువుల వాడకం కచ్చితంగా తగ్గించాలి.

-నున్న వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి, గుంటూరు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సంతమాగులూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిలో ఏల్చూరు పుట్టవారిపాలెం మధ్య బైకును టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఏల్చూరు శివారు రామిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన డీ రామారావు (48) మృతి చెందారు. రామిరెడ్డి పాలెం నుంచి పుట్టావారిపాలెంకు వెళుతున్న రామారావు బైకును వెనుక నుంచి మట్టి లోడుతో వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. రామారావు అక్కడికక్కడే మృతిచెందారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై పట్టాభిరామయ్య తెలిపారు.

రీసర్వేలో లోపాలు లేకుండా చూడాలి

- నాలుగు టీంలకు షోకాజ్ నోటీసుల జారీకి కలెక్టర్ ఆదేశం



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో లోపాలు లేకుండా చూసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సంతనూతలపాడు మండలం ఎం.వేములపాడులో మంగళవారం సాయంత్రం రీసర్వేను పరిశీలించారు. ఈ గ్రామంలో 400కు పైగా ఎకరాలను సర్వే చేశామని, విలేజ్ బౌండరీ కూడా సర్వే చేశామని, ప్రభుత్వ భూముల సర్వే 50శాతం పూర్తయిందని ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాగా ఎంతమంది రైతుల భూములను మంగళవారం సర్వే చేశారు, ఎన్ని బృందాలు ఫీల్డ్ విజిట్‌లో ఉన్నాయి అని ఆమె అధికారులను ప్రశ్నించారు. ఏడుగురు రైతులకు సంబంధించిన 30 ఎకరాలను సర్వే చేశామని వారు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో ఆర్డీవో లక్ష్మీప్రసన్న ద్వారా ఇద్దరు రైతులకు కలెక్టర్ ఫోన్ చేయించారు. ఎన్ని రోజులు ముందుగా సర్వేకు సంబంధించి నోటీసులు ఇచ్చారు, మీ సమక్షంలోనే భూములను సర్వే చేశారా? అని ఆర్డీవో ద్వారా ఆరా తీశారు. ఐదు టీంలుకు గాను ఒక టీం మాత్రమే ఫీల్డ్‌లో ఉన్నట్లు తెలుసుకున్న కలెక్టర్ మిగిలిన నాలుగు టీంలకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని సర్వేశాఖ సహాయ సంచాలకులు గౌస్‌బాషాను ఆదేశించారు. అనంతరం వేములపాడు సచివాలయాన్ని తనిఖీ చేశారు. భూముల రికార్డులకు సంబంధించిన ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను పరిశీలించారు. మ్యుటేషన్ విషయంలో నిబంధనలు ఉల్లంఘించరాదని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సచివాలయానికి వచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

వరికోత యంత్రం కింద పడి రైతు మృతి

టంగుటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : వరికోత యంత్రం కింద పడి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని సూరారెడ్డిపాలెంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పీలా పాండు (78) మూడు ఎకరాల్లో వరి సాగు చేశారు. సోమవారం యంత్రంతో వరి కోయిస్తున్నారు. ఈ సమయంలో యంత్రాన్ని డ్రైవర్ రివర్స్ చేస్తుండగా వెనుక ఉన్న పాండు దాని కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై నాగమల్లీశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పాండు కుమారుడు రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

డీఎస్పీ శ్రీనివాసరావు

సింగరాయకొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం సింగరాయకొండ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రతి రోజూ విజిబుల్ పోలీసింగ్ చేయాలని సూచించారు. సీసీ కెమెరాలు నేర నియంత్రణకు దోహదం చేస్తాయని తెలిపారు. ప్రజలను చైతన్యపరిచి వారి గృహాలు, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు.

ప్రభుత్వ భూమిలో గ్రానైట్ వ్యర్థాలు


దశాబ్దాల దారిని మూసివేశారని రైతుల ఆందోళన

ఆర్ణా క్వారీ అక్రమాలపై ఫిర్యాదులు

పరిశీలించిన మైనింగ్, రెవెన్యూ అధికారులు



పొలాలకు వెళ్లకుండా వాగు భూమిలో అడ్డుగా వేసిన డంప్



కొండను తలపించేలా పడ వేసిన గ్రానైట్ వ్యర్థాలు

బల్లికురవ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో దశాబ్దాల నుంచి రైతులు పొలాలకు వెళ్లే దారిని బాచిన కృష్ణచైతన్యకు సంబంధించిన ఆర్ణా గ్రానైట్ క్వారీ ఆక్రమించింది. లీజులు పొందడమేగాక ఇష్టానుసారంగా ప్రభుత్వ భూముల్లో గ్రానైట్ వ్యర్థాలను డంప్ చేసిందని మల్లాయపాలెనికి చెందిన రైతులు రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. గతంలో పనిచేసిన అధికారులు కొందరు ఇష్టానుసారంగా వ్యవహరించడం వలనే ఆ భూములను గ్రానైట్ క్వారీ నిర్వాహకులు ఆక్రమించుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

బల్లికురవ మండలం కొణిదెన రెవెన్యూ పరిధిలోని మల్లాయపాలెం సర్వే నెంబరు 934/14లో 3.95 ఎకరాల ప్రభుత్వ డొంక పోరంబోకు భూమి ఉంది. అలానే సర్వే నెంబరు 934/17/11లో 2.55 సెంట్లలో నీరు పారే వాగు భూమి ఉంది. ఆ భూముల్లో నుంచి ఆ గ్రామ రైతులు ఎన్నో దశాబ్దాల నుంచి పంట పొలాలకు వెళుతున్నారు. ఆ భూముల పక్కనే ఆర్ణా క్వారీ యజమానులు కొంత కాలం నుంచి రైతులకు ఇబ్బందులు కలిగించేలా గ్రానైట్ వ్యర్థాలను పోస్తున్నారు. ప్రస్తుతం ఆ వ్యర్థాలు కొండలను తలపించేలా ఉండడంతో రైతులు పొలాలకు వెళ్లే దారిమూసుకుపోయింది. పురాతనకాలం నుంచి ఉన్న ప్రధాన దారికి సైతం తాము లీజు పొందామంటూ క్వారీ యజమానులు రైతులకు ఆటంకాలు కలిగిస్తున్నారు. అధికారులు సైతం అడ్డగోలుగా రోడ్లకు లీజ్ ఎలా ఇస్తారని, అసలు దారి ప్రభుత్వ భూమిగా రికార్డులో ఉందని రైతులు అంటున్నారు. గ్రానైట్ క్వారీ నిర్వాహకులు తమ ఇష్టానుసారంగా విలువైన ప్రభుత్వ భూమిపై కన్నేసి డంప్ వేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ణా గ్రానైట్ క్వారీ ఆక్రమించిన ప్రభుత్వ భూమితో తమకు తీవ్ర ఇబ్బందులు ఉన్నాయని, వెంటనే డంప్‌ను తొలగించాలని మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు రైతులు ఫిర్యాదులు చేశారు. పది రోజుల కిందట చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, మైనింగ్ అధికారులు.. రైతులు ఫిర్యాదులు చేసిన డంపింగ్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మైనింగ్, రెవెన్యూ సర్వేయర్ల ద్వారా కొలతలు వేయిస్తామని చెప్పి వెళ్లారు. దీనిపై రైతులు మళ్లీ ఫిర్యాదు చేయడం మొదలుపెట్టారు. వెంటనే ప్రభుత్వ భూమిలో దారికి అడ్డుగా ఉన్న వ్యర్థాలను తీసి వేయించాలని వారు కోరుతున్నారు.

ప్రభుత్వ భూముల్లో వ్యర్థాలపై ఫిర్యాదు

మల్లాయపాలెం పరిధిలో ఉన్న డొంక పోరంబోకు, వాగు పోరంబోకు ప్రభుత్వ భూమిలో నిబంధనలు అతిక్రమించి ఆర్ణా గ్రానైట్ క్వారీ వారు పెద్ద ఎత్తున వ్యర్థాలను తెచ్చి డంప్ చేస్తున్నారు. ప్రస్తుతం అది కొండలా మారింది. అటుగా వెళ్లే రైతులకు దారి మూసుకుపోయింది. దీంతో గ్రామానికి చెందిన లేమాటి శ్రీనివాసరావు, మరి కొందరు రైతులు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, మైనింగ్ డీఎంజీ, కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌కు పది రోజులుగా ఫిర్యాదు చేస్తున్నారు. రైతుల ఫిర్యాదు మేరకు అధికారులు రంగంలోకి దిగారు. గతంలో దారి ఎలా ఉంది. ఇప్పుడు పరిస్థితి ఏంటని ఆరా తీసి అన్ని రికార్డులను పరిశీలించారు. గతంలో యానాది సంఘం అక్కడ ఉందని, వారు కూడా ఆ దారిని ఉపయోగించుకునేవారని రైతులు అధికారులకు తెలిపారు.

రామతీర్థం సామర్థ్యం పెంపు ప్రణాళికలు

జలవనరుల శాఖ అధికారులతో బీఎన్ భేటీ

గుండ్లకమ్మలో చెక్‌డ్యామ్‌లు, ఇతర పనులపై సమీక్ష



ఎస్‌ఈ, డిప్యూటీ ఎస్‌ఈలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

ఒంగోలు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న నీటి అవసరాలకు అనుగుణంగా రామతీర్థం ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం పెంపు కోసం ప్రణాళికలు రూపొందించాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ కుమార్ జలవనరులశాఖ అధికారులను కోరారు. నియోజకవర్గంలో జలవనరులశాఖ పరిధిలో ఉన్న రామతీర్థం రిజర్వాయర్, ఎన్ఎస్‌పీ ఆయకట్టు కాలువలు, గుండ్లకమ్మలో చెక్ డ్యామ్‌ల నిర్మాణాల ప్రతిపాదనలపై స్థానిక మంగమూరురోడ్డులోని తన కార్యాలయంలో మంగళవారం ఆ శాఖ అధికారులతో సమావేశమై చర్చించారు. జలవనరుల శాఖ ఎస్‌ఈ వరలక్ష్మి, డిప్యూటీ ఎస్‌ఈ రామకృష్ణ ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. రామతీర్థం నిర్మాణ సమయంలో ఆ ప్రాజెక్టుకు దిగువన ఉన్న 70వేల ఎకరాల ఎన్ఎస్‌పీ ఆయకట్టు స్థిరీకరణ, ఒంగోలు ఎస్ఎస్ ట్యాంకుతోపాటు ఇతర గ్రామాల్లోని తాగునీటి చెరువులను పరిగణనలోని తీసుకొని 1.50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించినట్లు అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతర కాలంలో కందుకూరుతోపాటు కనిగిరి, తాళ్లూరు, కొండపి, ప్రాంతాలు అలాగే కేవీపాలెం తాగునీటి పథకాలకు రామతీర్థం నుంచి నీటిని ఇచ్చేలా ఏర్పాటు చేయడంతో పాటు రామతీర్థం రిజర్వాయర్‌లో పూడిక కూడా రావడంతో నిల్వ కొంత తగ్గిందని దీంతో అసలు ఉద్దేశమైన సాగర్ ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యం నెరవేరడం లేదన్న అభిప్రాయం ఎమ్మెల్యే బీఎన్ అధికారుల ఎదుట వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రిజర్వాయర్ సామర్థ్యం పెంపునకు ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదించాలని అధికారులను కోరారు.

మరో టీఎంసీ పెంపునకు అంచనాలు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రామతీర్థం సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 1.50 టీఎంసీలకు అదనంగా మరో టీఎంసీ పెంచి 2.50 టీఎంసీల నిల్వ చేసేలా ప్రతిపాదనలు రూపొందించారన్న ఎమ్మెల్యే బీఎన్ తాజా అంచనాల ప్రకారం ఆ నివేదికను సిద్ధం చేయాలని సూచించారు. ఎన్ఎస్‌పీ చీమకుర్తి డివిజన్ పరిధిలో కాలువలు పలుచోట్ల అధ్వానంగా ఉండి నీరు పారుదల సరిలేని విషయంపై ఆయన అధికారులతో చర్చించారు. ఈ డివిజన్‌లో వచ్చే ఏడాది నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా అత్యవసర పనుల కింద రూ.7.50 కోట్లతో పనులు ప్రతిపాదించి ప్రభుత్వ ఆమోదం కోసం పంపినట్లు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. అలాగే గుండ్లకమ్మలో ప్రాజెక్టు దిగువ భాగంలో కీర్తిపాడు, చీర్వానుప్పలపాడుల వద్ద ప్రతిపాదించిన చెక్‌డ్యామ్‌ల నిర్మాణ ప్రతిపాదనలపై కూడా ఈ భేటీలో చర్చించారు. మద్దిరాలపాడు పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాటిపై హామీ ఇచ్చిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుచేశారు. వాటి విషయంలో గతంలోనే ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు నివేదించగా పలు వివరణలు కోరారని, వాటిపై కూడా సమగ్రరిపోర్టు పంపినట్లు ఎస్‌ఈ వరలక్ష్మి తెలిపారు.

అప్‌గ్రేడా.. డౌన్‌గ్రేడా...!

యూపీ పాఠశాలలపై తర్జనభర్జన

అద్దంకిలో వందేళ్ల నాటి సత్రం బడి పరిస్థితిపై సందిగ్ధం

హైస్కూల్‌గా మార్చాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి



అద్దంకి పట్టణంలోని నెంబర్1 యూపీ స్కూల్(సత్రం బడి)

అద్దంకి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యను గాడిలో పెట్టేందుకు సంసిద్ధమైంది. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం 117 జీవో ద్వారా అస్తవ్యస్తం చేసిన పాఠశాల విద్యను సరిచేసేందుకు పాఠశాలల పునరుద్ధీకరణ చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కొత్తగా వచ్చే మోడల్ స్కూల్స్ ద్వారా కొంతమేర ఉపయోగం ఉంటుండగా, మరి కొన్ని చోట్ల నష్టం కూడా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా యూపీ పాఠశాలలను తగ్గించే క్రమంలో కొన్నింటిని హైస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేస్తుండగా, మరి కొన్నింటిని మోడల్ స్కూల్స్‌గా డౌన్ గ్రేడ్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని యూపీ పాఠశాలల్లో 6, 7 తరగతులను తొలగించి మోడల్ ప్రైమరీ స్కూల్స్‌గా మార్చే అవకాశం ఉండడంతో ఆయా గ్రామాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో కొత్తగా 10 హైస్కూల్స్ వచ్చే అవకాశం ఉంది.

అద్దంకిలో శతాబ్దకాలం నాటి పాఠశాల స్థాయి తగ్గింపేనా?

అద్దంకి పట్టణంలో సుమారు 97 ఏళ్ల కిందట 1928లో సత్రం బడిని ప్రారంభించారు. అనంతరం 1988లో యూపీ స్కూల్‌గా అప్‌గ్రేడ్ అయింది. ప్రస్తుతం విద్యార్థులు 92 మంది కాగా 6, 7 తరగతులలో 35 మంది విద్యార్థులున్నారు. వైసీపీ పాలనలో 117 జీవో ఇచ్చిన సమయంలో సమీపంలో ఉన్న ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 3 నుంచి 7తరగతులను విలీనం చేసే ప్రతిపాదన వచ్చినప్పటికీ.. సమీపంలోని బాలికల ఉన్నత పాఠశాలలో అప్పటికే వెయ్యి మంది విద్యార్థినులు ఉండడం, సరైన వసతులు లేకపోవడంతో ఆ ప్రతిపాదన విరమించి యూపీ పాఠశాలగానే కొనసాగిస్తున్నారు. సత్రం బడిలో ఒకే ఒక్క స్కూల్ అసిస్టెంట్ పోస్టు ఉన్నప్పటికీ 6, 7 తరగతులలో 35 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలను డౌన్ గ్రేడ్ చేసి మోడల్ స్కూల్‌గా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

బాలికల ఉన్నత పాఠశాలలో సరైన వసతులు లేనందున ప్రత్యామ్నాయంగా సమీపంలో ఉన్న సత్రం బడిని హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తే అద్దంకి పట్టణంలోని పేద ప్రజలు నివశించే గుంజివారిపాలెం, గానుగపాలెం, ఇందిరానగర్, కొత్తపేట తదితర ప్రాంతాల విద్యార్థులకు మరింత ప్రయోజనం ఉంటుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే స్థానిక ప్రజాప్రతినిధులు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకుపోయారు. అధికారులు స్పందించి సత్రం బడిని హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మండలాల వారీగా ...

- అద్దంకి మండలంలో మొత్తం 6 యూపీ పాఠశాలలు ఉండగా వాటిలో వెంపరాల, ఉప్పలపాడు, నాగులపాడు యూపీ పాఠశాలలు యథావిధిగా కొనసాగిస్తూ, మిగిలిన కొత్తకొటికలపూడి, మోదేపల్లి, అద్దంకి పట్టణంలోని సత్రం బడులను డౌన్‌గ్రేడ్ చేసి మోడల్ స్కూల్స్‌గా మార్చే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం.
- సంతమాగులూరు మండలంలో కొప్పరం ఎంపీయూపీ(జనరల్)లో కొప్పరం ఎంపీయూపీ(ముస్లిం) పాఠశాలను విలీనం చేసి హైస్కూల్‌గా మార్చనున్నారు. కొమ్మాలపాడు, ఏల్చూరులో ఉన్న ఎంపీయూపీ(ముస్లిం) స్కూల్స్‌ను ఉర్దూ హైస్కూల్స్‌గా మార్చనున్నారు. పుట్టావారిపాలెం, కామేపల్లి యూపీ స్కూల్స్‌ను అలాగే కొనసాగించనున్నారు.
- బల్లికురవ మండలంలోని వల్లాపల్లి, కొప్పెరపాలెం, ముక్తేశ్వరం యూపీ స్కూళ్లు.. హైస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ కానున్నాయి. చెన్నుపల్లి, పాలమల్లాయపాలెం, సోమవరప్పాడు యూపీ స్కూల్స్‌ను యథావిధిగా యూపీ స్కూల్స్‌గా కొనసాగనున్నాయి.
- పంగులూరు మండలంలో రేణింగవరం, కొండమూరు, కోటపాడు యూపీ స్కూళ్లను హైస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేయనున్నారు. నూజెళ్లపల్లి యూపీ పాఠశాలను అదేవిధంగా కొనసాగిస్తారా లేక డౌన్‌గ్రేడ్ చేస్తారా అనే విషయంలో తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం.
- కొరిశపాడు మండలంలోని తమ్మవరం యూపీ స్కూల్‌ను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయున్నారు. మిగిలిన రెండు యూపీ పాఠశాలలను యథావిధిగా యూపీ పాఠశాలుగా కొనసాగించనున్నారు.

నిర్దోషిని కేసులో ఇరికిస్తున్నారు

డీఎస్పీకి బులియన్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధుల వినతి

చీరాలటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నిర్దోషిని దొంగ బంగారం రికవరీ కేసులో పోలీసులు ఇరికిస్తున్నారని చీరాల బులియన్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపించారు. చీరాల పరిధిలోని పలు స్టేషన్‌లలో గతంలో నమోదైన కేసుల్లో స్థానిక గొల్లపాలెంకు చెందిన జంగిలి తులసిని ఎస్సై కమలాకర్ విచారిస్తున్నారు. ఒక పాతనేరస్థుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈక్రమంలోనే ఆ కేసుల తాలూకా సుమారు 80 సవర్ల బంగారు ఆభరణాలను చీరాల సంత బజారులో బంగారం కరిగించే దుకాణం నడుపుతున్న దేవకర్ శ్రీరంగవేట్ కొనుగోలు చేశారన్న అనుమానంతో ఎస్సై కమలాకర్ మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆగ్రహించిన బులియన్ మర్చంట్ అసోసియేషన్ నాయకులు డీఎస్పీ ఎండీ మొయిన్‌కు సమస్యను వివరించారు. దీంతో స్పందించిన డీఎస్పీ న్యాయ విచారణ చేస్తామని, అధైర్యపడవద్దని హామీ ఇచ్చారు. అయితే బుధవారం అసోసియేషన్ ప్రతినిధులు బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై జిల్లా అధికారులను కలువనున్నట్లు సమాచారం. అయితే సుమారు 370 గ్రాములు అపహరణ జరగగా, ఇంకా కొందరు నేరస్థులను పోలీసులు అదుపులోకి తీసుకోనున్నట్లు సమాచారం.



డీఎస్పీను కలిసిన బులియన్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు

బియ్యం నిల్వల్లో తేడాలొస్తే చర్యలు

అవీఇవీ

తహసీల్దార్ పార్వతి



స్టాకు వివరాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ పార్వతి

వేటపాలెం(చీరాల టౌన్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు పంపిణీ చేసే పీడీఎస్ రైస్ నిల్వల్లో తేడా లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని వేటపాలెం తహసీల్దార్ పార్వతి చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సివిల్ సప్లయిస్ డీటీ గీతతో కలిసి మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామం షాపు నెంబర్ 16లో దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో 5 క్వింటాళ్ల రైస్, మూడు చక్కెర ప్యాకెట్లు తగ్గినట్లు గుర్తించారు. నిర్వాహకునిపై 6ఏ కేసు నమోదు చేశారు. కఠారివారిపాలెంలో షాపు నెంబర్ 29 షాపులో దాడులు నిర్వహించారు. సంతృప్తి చెందారు. అధికారులు వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ శాఖ అధికారుల దాడులు

రూ.7.10 లక్షల అపరాధ రుసుం విధింపు



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ, విజిలెన్స్ అధికారులు మంగళవారం చీరాల పరిధిలో మెరుపు దాడులు నిర్వహించారు. 24 బృందాలుగా ఏర్పడి 2,685 సర్వీసులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా 151 మందికి రూ.7.10 లక్షల అపరాధ రుసుం విధించారు. అధికారులు మాట్లాడుతూ విద్యుత్ చోరీ, దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో డీఈఈ జాన్ థామస్, విజిలెన్స్ విభాగం డిప్యూటీ అధికారి మల్లికార్జునరావు, ఆపరేషన్ డిప్యూటీ అధికారి హరిప్రసాదరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సహకరించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలు విచ్చలవిడిగా నమోదవుతున్నాయని ప్రతి ఒక్కరూ వీటిపై అప్రమత్తంగా ఉండాలని వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్టేషన్ పరిధిలోని బండ్ల బాపనయ్య పాఠశాల్లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈక్రమంలో స్మార్ట్ ఫోన్‌ల వినియోగంతో పాటు, డేటా చోరీ, ఓటీపీ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. చుట్టుపక్కల పరిసరాల్లో నేరాలు గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు. అలాగే ప్రధాన రహదారిలో రోడ్డు ప్రమాదాల నియంత్రణపై వాహన దారులకు అవగాహన కల్పించారు. ఎస్సై వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ఒత్తిడికి గురికాకుండా చదువుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రతినిధులు

వాడరేవు(చీరాలటౌన్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పరీక్షల్లో హాజరయ్యే విద్యార్థులు ఒత్తిడికి లోనవకుండా ఉండాలని, ఊర మస్తాన్‌రావు అన్నారు. మంగళవారం చీరాల మండల పరిధిలోని వాడరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మస్తాన్‌రావు, శివరాజకుమారి ట్రస్టు ఆధ్వర్యంలో పరీక్ష పరికరాలను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మణికేశ్వరంలో ప్రత్యేక ఆధార్ శిబిరం



ఆధార్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న కరిముల్లా

అద్దంకి, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని మణికేశ్వరంలో మంగళవారం ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని నిర్వహించారు. ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా ప్రారంభించారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు ఆధార్‌కార్డులు లేని విషయాన్ని మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకుపోవడంతో ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని ఏర్పాటు చేయించారని కరిముల్లా తెలిపారు. కార్యక్రమంలో బడావలి, మీరావలి, బుల్లియ్య, రఫీ, మేకల ఆదినారాయణ, మౌలాలి, బలరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మీరావలి పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ సుబ్బరాజు అన్నారు. అద్దంకి పట్టణంలోని రాయల్ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బరాజు మాట్లాడుతూ విద్యార్థులు కచ్చితంగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, చెడు వ్యసనాల వలన కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు.

10 మంది జూదరుల అరెస్టు

టంగుటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణిజేడు సమీపంలో నడుస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం అర్ధరాత్రి దాడి చేశారు. 10 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.93,700 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగమల్లీశ్వరరావు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని ఈసందర్భంగా ఆయన హెచ్చరించారు.

వైట్‌బర్లీ పొగాకు ధరలు పతనం

- దళారుల మాయాజాలంతో రైతుల్లో అయోమయం
- మొదటి రకం రూ.3వేల నుంచి రూ.4వేలలోపే
- గతేడాది రూ.9వేలకుపైనే

పర్చూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఒకపక్క అధిక పెట్టుబడులు, మరో పక్క అరకొర దిగుబడులు, నామమాత్రపు ధరలు వెరసి వైట్‌బర్లీ రైతులను కలవరానికి గురి చేస్తున్నాయి. రోజురోజుకూ దిగజారుతున్న ధరలు అన్నదాతలను మానసిక వ్యధకు గురిచేస్తోంది. వేలకువేలు పెట్టుబడులు పెట్టి సాగు చేసుకున్న రైతులకు ఈ ఏడాది నిరాశే మిగిలింది. గత ఏడాది దిగుబడులతో పాటు ధర కూడా ఆశాజనకంగా ఉండడం, వైరస్‌తో మిర్చి, సరైన దిగుబడి లేక శగన దెబ్బతినడంతో ప్రత్యామ్నాయంగా వేల ఎకరాల్లో వైట్‌బర్లీ పొగాకును రైతులు సాగు చేశారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో వైట్ బర్లీ సాగు చేసుకున్న రైతులు కన్నీటి పర్యంతరం అవుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ధర సగానికి పడిపోవడం ఇందుకు కారణం.


ధర లేక పోవడంతో ఇళ్లకు తరలిస్తున్న మొదటి రకం పొగాకు

మల్లె వంటి సమస్యతో చాలా చోట్ల దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. మొదటి వలుపు పొగాకు అమ్మితే సాగుకు అయిన ఖర్చులో కనీసం నాల్గోవంతు కూడా వచ్చే పరిస్థితి లేదు. దీంతో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో వైట్‌బర్లీ రైతులు నిరాశలో మునిగిపోయారు. ప్రస్తుతం ఉన్న ధరతో పొగాకును చేలో వదిలి వేయలేక తీసుకు రావాల్సి వస్తుందని రైతులు దిగాలు చెందుతున్నారు. మరో పక్క మొదటి వలుపు పొగాకు క్వింటా ధర రూ.3వేలే అని ఒకరు కాదు రూ.4వేలని మరొకరు ఇలా దళారుల ధరల మాయాజాలంతో అసలు ధర ఎంత ఉందో అర్థం కాక రైతులు అయోమయానికి గురవుతున్నారు. వ్యాపారులు, దళారుల మాయాజాలం నుంచి ప్రభుత్వం తమను కాపాడేందుకు చర్యలు తీసుకుంటే అప్పులఊబిలో చిక్కుకొని కోలుకోని విధంగా దెబ్బతింటామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంతో ఎన్నడూ లేనివిధంగా వైట్‌బర్లీ సాగు విస్తీర్ణం ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో భారీగా పెరిగింది. ఎకరానికి రూ.40-50 వేలు చెల్లించి సాగు కోసం భూములు తీసుకున్నారు. సాగుదారుల్లో అత్యధికం కౌలు దారులే. దున్నకం, ఎరువులు, నారు కొనుగోలు, నాటడం, పురుగు మందులు, ఆరుతడి తదితర పనుల కోసం ఎకరానికి రూ.లక్ష వరకు పెట్టుబడులు పెట్టినట్లు రైతులు చెప్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పలుకుతున్న ధరకు పంట అమ్ముకుంటే పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


వైట్ బర్లీ ఆకులను తాళ్లకు గుచ్చుతున్న కూలీలు


నిబంధనలపై డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంవీఐ రామకృష్ణారెడ్డి

రోడ్డు భద్రతా నియమాలను పాటించండి

చీరాల ఎంవీఐ రామకృష్ణారెడ్డి

ఇంకొల్లు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని చీరాల మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి సూచించారు. నివేదిత హైస్కూల్ ఆవరణలో రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా రోడ్డు భద్రత నియమాలపై డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా స్కూల్ బస్సు డ్రైవర్లు మద్యం సేవించి బస్సులు నడపరాదని, డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్లు మాట్లాడరాదని సూచించారు. అతి వేగంగా వాహనాలు నడపకూడదని, పిల్లలు బస్సు దిగి రోడ్డు దాటేప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రైవర్లు అప్రమత్తతతో జాగ్రత్తగా వాహనాలు నడిపి పిల్లలను క్షేమంగా ఇంటికి చేర్చేలా ప్రతి ఒక్క డ్రైవర్ ఉండాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించినట్లయితే ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐ రవి, మోటర్ వెహికల్ యూనియన్ నాయకులు మీరావలి ప్రైవేటు స్కూళ్ల డ్రైవర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కే మోడల్ స్కూళ్లు

ఇంకొల్లు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసమే ప్రభుత్వం పంచాయతీ పరిధిలో మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తుందని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో పావులూరు క్లస్టర్ సమావేశం ఎంఈవో-1 అజయ్‌బాబు అధ్యక్షతన జరిగింది. మోడల్ స్కూళ్లలో విద్యార్థులను చేర్పించేందుకు విద్యా కమిటీ చైర్మన్‌లు సహకరించాలని ఎంఈవో కోరారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై రాయితీలను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి జెన్నమ్మ

ఇంకొల్లు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఉద్యాన పంటలపై ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి జెన్నమ్మ సూచించారు. మండలంలోని గంగవరంలో ఉద్యాన శాఖ బాపట్ల వారి ఆధ్వర్యంలో మిరపలో సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్త బాలమురళీధర్ మిరపలో ప్రస్తుతం ఉన్న చీడలను వివరించారు. జెన్నమ్మ మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, బిందుసేద్యం, తుంపర సేద్యం, తైవాన్ పిచికారీ పరికరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రవిప్రకాశ్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల వర్ధంతి

ఇంకొల్లు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల స్మారక సమితి వ్యవస్థాపకుడు ఓరుగంటి సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో మహాగాయకుడు ఘంటసాల వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. భగవద్గీతను ఎంతో మధురంగా గానం చేసిన ఘనత ఘంటసాలదన్నారు. కార్యక్రమంలో కరి చంద్రమౌళి, ఓరుగంటి వెంకటేశ్వరశాస్త్రి, తమ్మన బ్రహ్మానందం, రామమూర్తి, కోటేశ్వరరావు, వెంకటరావు, రాంబాబు పాల్గొన్నారు.

అందుబాటులో గుండెపోటు నివారణ ఇంజక్షన్


స్టెమీ కార్యక్రమంలో మాట్లాడుతున్న హాస్పిటల్ సూపరింటెండెంట్ సుభాషిణి

చీరాలటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : గుండె పోటు సమస్యతో అత్యవసరంగా బాధపడుతున్న రోగులకు అందుబాటులో ప్రాముఖ్యత కలిగిన ఇంజక్షన్‌తో ప్రాణాపాయ స్థితి నుంచి సురక్షితంగా ఉంచవచ్చని చీరాల ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.సుభాషిణి అన్నారు. మంగళవారం హాస్పిటల్ ప్రాంగణంలో వైద్యం కోసం వచ్చిన వారికి, ప్రజలకు స్టెమీ (గుండెపోటు ఇంజక్షన్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గుండెపోటు సమస్యతో బాధపడుతున్న వారికి అత్యవసరంగా అందించే టెనెక్టెప్లస్ ఇంజక్షన్ ఖరీదు సుమారు రూ.40 వేలు వరకు ఉంటుందని చెప్పారు. ఈక్రమంలో నేరుగా ప్రభుత్వ వైద్యశాలలను సంప్రదించినట్లయితే ఉచితంగా ఇస్తున్నట్లు వివరించారు. సామాన్య ప్రజలు వైద్య సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు డా.పృథ్వీ, డా. శ్రీకాంత్, డా. హరిబాబు, ఆరోగ్య సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : గుండెపోటుకు గురైన వారికి ఉపశమనం కోసం ఇచ్చే ఇంజక్షన్ అద్దంకి సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో అందుబాటులో ఉందని సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ డి.శరత్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. గుండెపోటుకు గురైన వారు తక్షణమే ప్రభుత్వ వైద్యశాలలను సంప్రదించాలన్నారు. బయట ఈ ఇంజక్షన్ ధర రూ.40వేలు ఉంటుందని, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా వేయడం జరుగుతుందని తెలిపారు.

నవోదయం 2.0తో సారాపై ఉక్కుపాదం

పాత నేరస్థులకు సత్ప్రవర్తన ఉంటే ఉపాధి అవకాశాలు

చీరాలటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నవోదయం 2.0తో సారా తయారీపై ఉక్కుపాదం మోపనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ బొంతా వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం చీరాల మండల పరిధిలో సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా వీవర్స్ కాలనీలో సముద్రాల శాంతి వద్ద 16 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే తోటవారిపాలెంలో దాడులు నిర్వహించి గండి గోపీ వద్ద 2లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు. ఈసందర్భంగా చీరాల ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో నూతన స్కీం ద్వారా ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. సారా నియంత్రణకు అన్ని విధాలా కృషి చేయనున్నట్లు చెప్పారు. సత్ప్రవర్తన కలిగిన పాత నేరస్తులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలను వెల్లడిస్తున్న అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, సీఐ నాగేశ్వరరావు


పర్చూరులో తిరుగుతున్న కొండముచ్చు

పరుగో పరుగు

భారీ కొండముచ్చుతో ప్రజలు బెంబేలు

పర్చూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : భారీ కొండముచ్చు మంగళవారం పర్చూరు గ్రామంలో సంచరించింది. దీనిని చూసిన ప్రజలు ఆందోళనతో పరుగు తీశారు. గ్రామంలోని ప్రధాన రహదారిపై ఆ కొండముచ్చు పరుగులు తీస్తూ రావడంతో ఎక్కడ తమపై దాడి చేస్తుందోనని ప్రజలు భయపడ్డారు. దాన్ని చూసిన వానరాలు సైతం పరుగులు తీసాయి. కొంతసేపటి తరువాత జనసంచారంలోకి వచ్చి ప్రజలపై ఎలాంటి దాడి చేయకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. కోతివలే కొండముచ్చు దాడికి పాల్పడదని కొందరు చెప్పినప్పటికీ అది భారీగా ఉండడంతో ప్రజలు బెంబేలెత్తారు.

సాగర హారతిని జయప్రదం చేయండి

వాడరేవు(చీరాలటౌన్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నేడు మండల పరిధిలోని వాడరేవు ఆంజనేయుని విగ్రహం సమీపంలో సముద్ర సాగర హారతి జరుగుతుందని తాడివలస దేవరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే బుధవారం నుంచి పౌర్ణమి కావడంతో నాలుగు రోజుల పాటు భజన కార్యక్రమం, పంచామృతాలతో స్ఫటిక శివలింగానికి అభిషేకం, అనంతరం మంత్ర పుష్పం, అనంతరం సాగర హారతి ఉంటుందని భక్తులు విశేషంగా హాజరై జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

లక్ష్మీనరసింహస్వామి హుండీల కానుకలు లెక్కింపు

అద్దంకి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో హుండీలలోని కానుకల లెక్కింపు మంగళవారం జరిగింది. గత 5 నెలల 25 రోజులలో హుండీల ద్వారా వచ్చిన కానుకలను లెక్కించగా రూ.4,74,165 వచ్చాయి. గతంలో 5 నెలల కాలానికి రూ.4,15,230 వచ్చాయి. అద్దంకి డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఈవో కోటిరెడ్డి ఆధ్వర్యంలో హుండీల కానుకల లెక్కింపు జరిగింది. రిటైర్డ్ హెచ్‌ఎం తాతా హరిబాబు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఇంటింటికీ భగవద్గీత

బల్లికురవ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నుపల్లి, కొండాయపాలెం, బల్లికురవ, నక్కబొక్కలపాడు గ్రామాలలో మంగళవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. భగవద్గీత పఠనంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఘడియం పెద్దిరెడ్డి, ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, చల్లగుండ్ల భాస్కరరావు, చిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతులు పంట నమోదు చేయించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో వెంకటకృష్ణ


ఇంకొల్లులో మాట్లాడుతున్న ఏవో వేణుగోపాల్

పంగులూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రబీలో సాగు చేసిన పంట వివరాలను రైతు సేవా కేంద్రాలలో విధిగా నమోదు చేయాలని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి కోరారు. మండలంలోని చందలూరు, నూజెళ్లపల్లి గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న మిరప, పొగాకును రైతులతో కలిసి ఏవో పరిశీలించారు. రైతులకు ప్రత్యేక గుర్తింపు కోసం ప్రభుత్వం అగ్రిస్టాక్ యాప్‌ను అందుబాటులో ఉంచిందన్నారు. సొంత భూమిగల రైతులందరికీ ప్రత్యేక ఐడీ నెంబర్‌ను జనరేట్ చేస్తామని, దీనికోసం రైతులు ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు, పట్టాదారు పాస్ పుస్తకంతో సేవా కేంద్రాలకు వెళ్లి ఆ కార్డును పొందాలని కోరారు. పీఎం కిసాన్, రైతు భరోసా, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, యంత్ర పరికరాలు, పంట రుణాలు పొందాలంటే ఐడీ నెంబరు కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంట్యాల కృష్ణారావు, రామలింగస్వామి, కందిమళ్ళ రామాంజనేయులు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పర్చూరు : నూతలపాడు, పోతుకట్ల గ్రామాల్లోని రైతులకు తెగుళ్ల, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఏవో రామోహన్‌రెడ్డి నేతృత్వంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ప్రస్తుతం శగనకు ఎండు, వేరుకుళ్లు, తుప్పు తెగులు సోకుతుందన్నారు. వీటి నివారణకు మందులను పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ స్విబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు : రైతులు రైతు సేవా కేంద్రాలలో ఫార్మర్ రిజిస్ట్రీపోర్టల్‌లో నమోదు చేయించుకొని ప్రత్యేక ఐడీ నెంబర్ పొందినట్లయితే వారికి ప్రభుత్వ పథకాలు అందుతాయని వ్యవసాయాధికారి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని ఇడుపులపాడులో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యద్దనపూడి : వ్యవసాయశాఖకు చెందిన పలు సబ్సిడీ పథకాలను పొందాలంటే రైతులు ఏపీఎఫ్ఆర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ అధికారి మేరమ్మ అన్నారు.మంగళవారం మండలంలోని అనంతవరం, సూరవరపుపల్లి గ్రామాలలోని రైతులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు విత్తనాలు, ఎరువులు పురుగుమందులు కొనుగోలు చేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వీపీఏ మధుప్రియ, రైతులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : ప్రభుత్వ పథకాల అమలుకు ప్రతి రైతు తమ భూమి వివరాలతో తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని పేరయపాలెం, మోదేపల్లి గ్రామాలల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రత్యేక నెంబర్‌తో అన్ని వ్యవసాయ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి ఎస్.దీప్తి, ఏఈవో కోటేశ్వరరావు, దుర్గరావు, పాల్గొన్నారు.


సోమవరప్పాడులో తెగులు సోకిన మిర్చిని పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు

మిర్చిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బల్లికురవ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మిర్చికి పలు రకాల తెగుళ్ల ఉధృతి ఉందని రైతులు అప్రమత్తతో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన అధికారి హనుమంతునాయక్ అన్నారు. మంగళవారం మండలంలో ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు, గ్రామాలలో రైతులు సాగు చేసిన మిర్చి, బొప్పాయి పైర్లను ఉద్యాన శాఖ అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ మిరప లో నల్ల తామరపురుగు, కాయమచ్చ తెగులు అధికంగా ఉందని రైతులు మెళకువలతో సాగు చేయాలన్నారు. బొప్పాయి, అరటి రైతులు వేసవి కాలం దృష్ట్యా నీటి యాజమాన్య, పోషకాల ఎంపిక పంటలో వచ్చే వైరస్ తెగుళ్లకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. ఈ పరిశీలనలో ఉద్యాన కన్సల్టెంట్ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

16న నాగేశ్వరరరావుకు పుట్టంరాజు కళా పురస్కారం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : అభినవశ్రీహరిగా పేరుగాంచిన తన్నీరు(అద్దంకి) నాగేశ్వరరావుకు ఈ నెల 16వ తేదీన పట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ కళాపురస్కారం అందజేయనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈనెల 16వ తేదీన పట్టుంరాజు కళాక్షేత్రంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాహితీ కౌముది అధ్యక్ష, కార్యదర్శులు రఘురామశర్మ, కేవీ పోలిరెడ్డి, కోశాధికారి మురళీసుధాకరరావు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు రవితేజ, రమీజ్‌అహ్మద్

బల్లికురవ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి సురక్ష మాతృ అభియాన్ పథకంలో భాగంగా గర్భిణులకు ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం అందుబాటులో ఉందని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు రమీజ్‌అహ్మద్, రవితేజ పేర్కొన్నారు. మంగళవారం వైద్యశాలలో మండలంలో అన్ని గ్రామాలలో ఉన్న గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి వారికి సులువైన పద్ధతిలో కాన్పులు అయ్యేందుకు ఉపయెగ పడే పలు రకాల యోగాసనాలను నేర్పించారు. బలవర్ధకమైన అహారం తీసుకోవడం ద్వారా పుట్టే బిడ్డలు కూడా ఆరోగ్యంగా జన్మిస్తారని వారు తెలిపారు.

బర్డ్‌ఫ్లూ కలవరం

చికెన్ దుకాణాలు వెలవెల

పర్చూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పలు జిల్లాలో బర్డ్‌ఫ్లూ సోకి కోళ్లు మృతి చెందడం మాంసం ప్రియుల్లో కలవరం రేపింది. చికెన్ తినేందుకు భయపడుతున్నారు. మరో పక్క కోళ్లకు అంతుచిక్కని వైరస్ సోకి కుప్పలుతిప్పలుగా చనిపోతున్నాయన్న ప్రచారంతో చికెన్ కొనుగోలు చేసుకునేందుకు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో చికెన్ దుకాణాలు వెలవెలబోతున్నారు.

ఆచూకీలేని మత్స్యకారుని పెద్దకర్మకు ఏర్పాట్లు

వాడరేవు (చీరాలటౌన్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో వేటకు వెళ్లి ఆచూకీ లేని మత్స్యకారునికి బాధిత కుటుంబం పెద్దకర్మకు ఏర్పాట్లు చేశారు. గ్రామానికి చెందిన ఓసేపిల్లి రమణ(53) మత్స్యకారుడు. గత ఆదివారం మరి కొందరు మత్స్యకారులతో కలిసి ఆయన విజయవాడ సమీపంలోని బందరు వైపు వేటకు వెళ్లారు. అయితే అర్థరాత్రి నుంచి రమణ ఆచూకీ లేకపోవడంతో అన్నిచోట్లా వెదికిన కుటుంబ సభ్యులకు నిరాశే మిగిలింది. దీంతో చేసేదిలేక వచ్చే శుక్రవారం పెద్ద కర్మకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే చివరి చూపైనా దక్కక పోవడంతో ఆ కుటుంబం విషాదంలో ఉంది.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

వేటపాలెం (చీరాలటౌన్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని సుమారు 50 సంవత్సరాల మహిళ రైలు పట్టాలు దాటుతూ రైలు ఢీకొని మృతి చెందారు. ఈ ఘటన వేటపాలెం రైల్వే స్టేషన్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతిరాలి వద్ద ఆధారాలు లభించలేదు. ఎరువు రంగు చీర ధరించి ఉంది.

ఉత్తమ అధికారులకు సన్మానం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల రెవెన్యూ కార్యాలయంలో పని చేస్తూ రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా అధికారుల చేతుల మీదుగా ఉత్తమ అధికారులుగా అవార్డులను అందుకున్న వారికి మంగళవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మాంచారు. రెవెన్యూ కార్యాలయంలో పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌బాబు, ఆర్ఐ రామారావు(శంకర్), సర్వేయర్ హనుమంతరావుతో పాటు తహసీల్దార్ శ్రీచరణ్ రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ ద్వారా ఉత్తమ అధికారులుగా పురస్కారాలను అందుకున్న సందర్భంగా ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేవారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీచరణ్, ఏఎస్‌వో అమర్‌నాథ్, ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, ట్రెజరర్ నాగేశ్వరరావు, కార్యదర్శి శ్రీ మన్నారాయణమూర్తి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు జగన్నాథం యోహాను పాల్గొన్నారు.


ఉత్తమ అధికారులను సన్మానిస్తున్న తహసీల్దార్ శ్రీచరణ్, ఐక్య వేదిక సభ్యులు